తారాపురంలో తాగునీటికి తంటాలు

పెద్దకడబూరు మండలంలోని తారాపురం గ్రామంలో తాగునీటి ఎద్దడి వేధిస్తోంది. ఇక్కడ వారానికోసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఆ ఒక్కరోజు పట్టుకున్న నీటిని వారం రోజులు పొదుపుగా వాడుకోవాలని, లేదంటే గొంతు తడుపుకోవడం కష్టమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1,500 జనాభా ఉన్న గ్రామానికి 5 కి.మీ. దూరంలోని ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే గ్రామీణ నీటి సరఫరా సిబ్బంది నిర్లక్ష్యంతో వారానికొకసారి రావడంతో అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్ మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, పెద్దకడబూరు



రాత్రిపూట అవస్థలు పడుతున్న గ్రామస్థులు

ప్రజా సమస్యలు నాణ్యతగా పరిష్కరించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ డా.బి.నవ్య తదితరులు బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 36 అర్జీలు రీఓపెన్ అయ్యాయని, రీఓపెన్ కాకుండా చూడాలని పేర్కొన్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన దరఖాస్తులు 30 వరకు పెండింగ్‌లో ఉన్నాయని, వీటికి మొదటి ప్రాధాన్యమిస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

ఇసుక తోడేళ్ల మాయ



కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఐదేళ్ల ఇసుకలో అక్రమాల 'రుచి' చూసిన వైకాపా నేతలు 'కూటమి' ప్రభుత్వంలోనూ పెత్తనం చేస్తున్నారు. జిల్లాకు చెందిన వైకాపా నాయకుల వాహనాలకు రోజూ ఇసుక సరఫరా (బుకింగ్) అవుతోంది. మిగిలిన వాహనాలకు ఇరవై రోజులైనా ఒక్క ట్రిప్పు కూడా నమోదు (బుకింగ్) కాకపోవడమే ఇందుకు నిదర్శనం. జిల్లాలో ట్రాక్టర్లు, ఆరు టైర్ల వాహనాలు, 10 టైర్ల టిప్పర్లు, 12 టైర్ల వాహనాలు ఇలా.. 304 రవాణా ఏజెన్సీలు ఇసుకను సరఫరా చేసేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. ఇందులో 12, పది టైర్ల వాహనాలకు సంబంధించి వైకాపా నాయకులవే అధికంగా ఉండటం గమనార్హం.

- వైకాపా నేతల పెత్తనం
- పాత పరిచయాలతో దందా
- నమోదులో చక్రం తిప్పుతున్న వైనం

నిఘా నేత్రం



12 టైర్లను 10 టిప్పర్లుగా చూపి..

● కర్నూలు జిల్లా కేంద్రానికి చెందిన కొందరు వైకాపా నాయకుల టిప్పర్లకు నిత్యం ఇసుక సరఫరా జరుగుతోంది.. అవన్నీ 12 టైర్ల టిప్పర్లే.. గనుల శాఖలో వాహనాల రిజిస్ట్రేషన్ చేయించుకున్న జాబితాలో 10 టైర్ల టిప్పర్లుగా నమోదయ్యాయి. నగరంలో రవాణా చేసేందుకు వీలుగా ఆన్‌లైన్‌లో మార్పులు చేయించుకున్నారని.. గంపగుత్త (బల్క్) బుకింగ్ పేరుతో అక్రమాలకు తెరలేపారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

● ఏపీ39యూఎక్స్ 6369 అనే టిప్పర్‌కు 12 టైర్లు ఉన్నాయి. జిల్లా గనులు, భూగర్భ శాఖ ఆన్‌లైన్ ఉచిత ఇసుక విధానంలో పది టైర్ల వాహనంగా మార్చేసుకున్నారు. ఏపీ39వీఏ1599 అనే వాహనానికి మార్పులు చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఇలా 12 టైర్ల వాహనాలన్నీ.. 10 టైర్లుగా నమోదయ్యాయి.

● ఆన్‌లైన్ ఇసుక విధానంలో పది టైర్ల వాహనాల్లో 18 టన్నుల ఇసుక నింపాలి.. కానీ 12 టైర్ల వాహనం వెళ్లగానే 24 టన్నులు నింపుతున్నారన్న విమర్శలున్నాయి. ఇసుకను నింపే గుత్తేదారుతో సదరు నేతలకు పాత పరిచయాలు ఉండటంతో వారి వాహనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

- నగరంలో 12 టైర్ల టిప్పర్లకు అనుమతిలేదని ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు వెల్లడించారు. దీంతో సదరు నాయకులు 12 టైర్ల టిప్పర్లను ఆన్‌లైన్ ఉచిత ఇసుక విధానంలో పది టైర్ల టిప్పర్లుగా రిజిస్ట్రేషన్‌లో మార్పులు చేయించుకున్నారు.
- నిత్యం 200-300 టన్నుల మేర ఎక్కువ ఇసుక తరలుతోందని.. ఫలితంగా రూ.50-80 వేల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.
- వాస్తవానికి ఒక వ్యక్తికి 20 టన్నులే ఇస్తున్నట్లు జిల్లా యంత్రాంగం చెబుతోంది. అందుకు విరుద్ధంగా ఒక టిప్పర్‌కు ఒక ట్రిప్పునకు 4-6 టన్నుల మేర అధిక మొత్తంలో ఇసుక తరలుతోందన్న ఆరోపణలున్నాయి.

రెండు రోజుల్లో నమోదు ఇలా
- నమోదు చేసుకొన్న వారు 429
- ఇళ్ల నిర్మాణాలకు 5,023.0 టన్నులు
- ప్రభుత్వ అవసరాలకు 2,104.5 టన్నులు

క్షేత్రస్థాయిలో ఆరా

కర్నూలు నగరపాలక సంస్థతోపాటు జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఇసుక రవాణా చేసిన ప్రాంతాల్లో సచివాలయ ఉద్యోగులు తనిఖీలు చేపట్టారు. 'ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ విధానానికి సంబంధించి కొన్ని వాహనాలకే రోజువారీ నమోదవుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ డీడీ వి.రవిచంద్ పేర్కొన్నారు.

తవ్వేది వారే.. నింపేది వారే

తుంగభద్ర నదీ తీర ప్రాంతమైన సి.బెళగల్ మండలం కొత్తకోట, ముడుమాల, సింగవరం, పల్దొడ్డి, ఈర్లదిన్నె గ్రామాల పరిధిలో నది లోపల (డీసిల్టింగ్ పాయింట్లు) ఇసుక తవ్వకాలకు అనుమతులిచ్చారు. గత వైకాపా పాలనలో చక్రం తిప్పిన బోట్స్‌మెన్ సంస్థకే ప్రస్తుతం ఇసుక తోడే బాధ్యతను జిల్లా యంత్రాంగం అప్పగించింది. తోడిన ఇసుకను ఒడ్డున నిల్వ చేసి ట్రాక్టర్లు, టిప్పర్లలో నింపడం (లోడింగ్ చేయడం) వంటి పనులు గతంలో వైకాపా హయాంలో పనిచేసినవారే. ఇసుక రవాణా వాహనాలూ ఆ పార్టీ నాయకులవే.. ఇది చాలదన్నట్లు విజయవాడలోని ఆన్‌లైన్ ఇసుక విధానం బుకింగ్ పాయింట్లలోని కొందరు ఆపరేటర్లు గతంలో పనిచేసినవారే ఉన్నారు. ఇలా ఎక్కడ చూసినా వైకాపా వారి హవా నడుస్తోంది.

20 రోజులుగా నిరీక్షణ

– వేణు, వాహనదారుడు



మా వాహనాన్ని ఉచిత ఇసుక విధానంలో భాగంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. అక్టోబరు 1వ తేదీన ఒక ట్రిప్పు రవాణా చేశాం.. ఆ తర్వాత గత 20 రోజులుగా ఒక్క ట్రిప్పు కూడా ఇసుక బుకింగ్ కావడం లేదు. కొందరి వాహనాలకు రోజూ బుకింగ్ జరుగుతోంది.

కనురెప్పల మాటున రుధిర ధారలు

కన్న తల్లి కలలు కన్నీటి అలలుగా మారాయి..
నాన్న ఆశలు నిరాశను చూపుతున్నాయి..
చిన్నారి శరీరంపై చారలు శూలాలై గుచ్చుతున్నాయి..
కనురెప్పల మాటున రుధిర ధారలు జాలువారుతున్నాయి.

తెల్లవారుతుంటే ఆ ఇంటి వాకిళ్లు కలవరపడుతున్నాయి..
చీకట్లు వాలిపోతున్నా కళ్లు మేల్కొనే ఉంటాయి.
నరక యాతన చూసి గుండెలవిసిపోతున్నాయి..
వేదన నిండిన మనసులు అలసిపోతున్నాయి..



★ కాలిన గాయాల్లా చిన్నారి శరీరమంతా నల్లని మచ్చలు.. దురద మంటలతో తల్లడిల్లిపోతున్నాడు. కుమారుడి పరిస్థితి చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. రెండేళ్ల వయసున్న భార్గవ్‌కుమార్ గాథ ఇది.!!

– న్యూస్‌టుడే, ఆదోని ఎస్కేడీ కాలనీ

ఆదోని పట్టణం అరుణ్‌జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న ప్రేమ్‌కుమార్, పద్మావతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రేమ్‌కుమార్ బేల్దారి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. రెండేళ్ల కుమారుడు భార్గవ్‌కుమార్ 'లామెలర్ ఇక్తియోసిస్' అనే వింత చర్మవ్యాధితో జన్మించాడు. భార్గవ్ పుట్టినప్పటి నుంచి రెండేళ్లుగా కర్నూలు నగరానికి వెళ్లి చికిత్స చేయిస్తున్నారు. ఇందుకోసం ప్రతి నెలా రూ.7వేలు వరకు మందుల ఖర్చులు వస్తోందని.. రానుపోను ఛార్జీలు కలిపి ప్రతి నెలా బాలుడి వైద్యం కోసమే రూ.10వేలు వెచ్చించాల్సి వస్తోందని బాలుడి తండ్రి వాపోతున్నారు. బాలుడి ఒంటినిండా చారలు పడటంతో విపరీతమైన దురద వస్తోంది. దాని కారణంగా రక్తం కారుతుంది.. ఎక్కువ సేపు ఏడిస్తే కంట్లో నుంచీ రక్తం వస్తోందని తల్లిదండ్రులు విలపిస్తున్నారు. రాత్రివేళ చిన్నారికి నిద్రపట్టక నరక యాతన అనుభవిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నడవడానికి కూడా సరిగా రావడంలేదని, కనీసం నిలబడలేకపోతున్నాడని వాపోతున్నారు. బాలుడికి చికిత్స కోసం రూ.లక్షలు వెచ్చించినా వ్యాధి మాత్రం నయం కావడంలేదు.

కష్టం చూడలేకపోతున్నాం

– ప్రేమ్‌కుమార్, బాలుడి తండ్రి

నేను బేల్దారి పనులు చేస్తూ.. కుటుంబాన్ని పోషించడమే కష్టమైంది. అందులోనూ బాలుడి వైద్యం కోసం ప్రతి నెలా రూ.10వేల వరకు వెచ్చించక తప్పడం లేదు. ఇప్పటి వరకు రూ.2 లక్షల వరకు అప్పు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. బాలుడి వైద్య ఖర్చుల కోసం పింఛను ఇప్పించాలని గత ప్రభుత్వంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ కనికరించలేదు. కొత్త ప్రభుత్వంలోనైనా బాలుడికి పింఛను వస్తుందన్న ఆశతో సదరం శిబిరంలో వైద్యులను సంప్రదించాం. పరీక్షించి ఈ వ్యాధికి వికలాంగ ధ్రువపత్రం ఇవ్వలేమన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చిన్నారిని నరకయాతన నుంచి తప్పించాలని వేడుకుంటున్నాం. మా బాబు పరిస్థితి చూసి తట్టుకోలేకపోతున్నాం.

ముగిసిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జిల్లాలో 3వ తేదీన ప్రారంభమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సోమవారంతో ముగిసిందని డీఈవో శామ్యూల్ తెలిపారు. సోమవారం ఉదయం సెషన్‌లో 1,504 మందికి గాను 1,323 మంది పరీక్ష రాయగా 181 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. మధ్యాహ్నం సెషన్‌లో 394 మందికి అభ్యర్థులకుగాను 291 మంది పరీక్ష రాశారని.. 103 మంది హాజరు కాలేదని పేర్కొన్నారు.



పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థులు



క్యాన్సర్ మింగేస్తోంది పింఛను అందనంటోంది

ఆదోనికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆయనకు ఇద్దరు ఆడపిల్లలు. ఆరోగ్యం విషమించడంతో కుటుంబ పోషణ దయనీయంగా మారింది. ఆహారం సైతం ట్యూబు నుంచే తీసుకోవాల్సిన పరిస్థితి. కూలీ పనులు చేసుకుంటేనే జీవనం సాగుతుందని.. పింఛను ఇచ్చి ఆదుకోవాలని వెంకటేశ్వర్లు భార్య ఉరుకుందమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి అధికారులకు విన్నవించారు.

– ఈనాడు, కర్నూలు

సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే : జిల్లాలో 123 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకుగాను కలెక్టర్ రంజిత్ బాషా సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఒక్కో సంఘానికి తహసీల్దారు, జలవనరుల శాఖ ఇంజినీరును ఎన్నికల అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రకటన విడుదలైనప్పటి నుంచి 40 రోజుల్లో ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంది. ఈనెల 21 నుంచి వచ్చే నెల 29వ తేదీ వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

పోలీసుల సేవలు నిరుపమానం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : దేశ సరిహద్దులో జవాన్లు, అంతర్గత భద్రతలో పోలీసులు తమ ప్రాణాలు లెక్కచేయకుండా అవిశ్రాంతంగా అందిస్తున్న సేవలు నిరుపమానమని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. నగరంలోని జిల్లా పోలీసు కవాతు మైదానంలో సోమవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినానికి హాజరై మాట్లాడారు. పోలీసు శాఖలో పనిచేయటం ఎంతో కష్టమని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా స్పందించేది వారేనని కలెక్టర్ చెప్పారు. అమరవీరుల త్యాగనిరతిని అందరూ గుర్తుంచుకుని వారి కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి అందరూ పాటుపడాలన్నారు. ఎస్పీ జి.బిందుమాధవ్ మాట్లాడుతూ దేశ భద్రత కోసం సైనికులు, పోలీసులు ప్రాణత్యాగం చేస్తున్నారన్నారు. గడిచిన ఏడాది కాలంలో 216 మంది సైనికులు, పోలీసులు వీరమరణం పొందారన్నారు. అనంతరం శ్రద్ధాంజలి ఘటించి అమరవీరుల స్తూపానికి నివాళి అర్పించారు. అమరవీరుల కుటుంబసభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జేసీ నవ్య, ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణమోహన్, హోంగార్డు దళాధిపతి మహేష్‌కుమార్, డీఎస్పీలు బాబూప్రసాద్, శ్రీనివాసాచారి, శ్రీనివాసరావు, పోలీసు సంక్షేమ ఆసుపత్రి వైద్యులు శ్రవంతి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




పోలీసు అమర వీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తదితరులు

ఆటకు శ్రీకారం



ఎమ్మిగనూరు పట్టణంలో మాచాని సోమప్ప బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3,700 మంది విద్యార్థినులు చదువుతున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో 55 మంది కబడ్డీలో ప్రతిభ చాటారు. కొత్తగా కోర్టు ఏర్పాటు కావడంతో మరింత సాధన చేసేందుకు దోహదపడుతుందని విద్యార్థినులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు.

కర్నూలు విద్య, ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సర్కారు బడుల్లో చదువుతున్న భావితరానికి పదును పెట్టేందుకు కేంద్రం ముందుకొచ్చింది. ఇందులో భాగంగా 'పీఎం-శ్రీ' పథకానికి శ్రీకారం చుట్టింది. ఎంపిక చేసిన బడుల్లో ప్రయోగశాలలు ఆట స్థలాలు అభివృద్ధి చేయనున్నారు. ఎంపిక చేసిన బడుల్లో ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షలు వెచ్చించారు. ఈ నిధులతో క్రికెట్ మైదానం, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, లాంగ్‌జంప్, కబడ్డీ, షటిల్, ఫుట్‌బాల్, రన్నింగ్ గ్రౌండ్ పిచ్‌ను అభివృద్ధి చేయనున్నారు. కర్నూలు జిల్లాలో 37 పాఠశాలల్లో ఆట స్థలాల అభివృద్ధికి ఒక్కో బడికి రూ.5 లక్షలు వెచ్చిస్తారు. ఇందులో ఒక్కో బడికి రూ.2 లక్షలు చొప్పున రూ.60 లక్షలు మంజూరయ్యాయి. నంద్యాల జిల్లాలో 37 బడుల్లో క్రీడాభివృద్ధికి ఒక్కో బడికి రూ.లక్ష చొప్పున రూ.37 లక్షలు మంజూరయ్యాయి.



ఇక్కడ ప్రయోగశాలలు

● కర్నూలు జిల్లాలోని చిప్పగిరిలోని నేమకల్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, గూడూరు, కర్నూలు మండలం మిలిటరీ కాలనీ, పోలకల్, ఎర్రగిరి, పెద్దపాడు, పెరవలి, హెచ్.కైరవడిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో రసాయన ప్రయోగశాలలు ఏర్పాటు అవుతున్నాయి.

● నంద్యాల జిల్లాలో దొర్నిపాడు, ఇల్లూరు కొత్తపేట, కొనిదెల, కొత్తపల్లి, ఎన్.కొతపల్లి, పేరుసోమలలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా పాఠశాలల విద్యార్థులకు ప్రయోగాల్లో శిక్షణ ఇచ్చేందుకు ఉపయోగపడతాయి.

భూమి అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు

ఆదోని నేరవార్తలు, ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో రూ.కోట్లు విలువైన 6 సెంట్ల భూమిని నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న డాక్యుమెంట్‌ను సోమవారం రద్దు చేసినట్లు ఆదోని సబ్ రిజిస్ట్రార్ హాజీమియా తెలిపారు. ఆ భూమిని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ప్రధాన అనుచరుడు డాక్టరు రవికిరణ్ నకిలీ పత్రాలు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితులు ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విదితమే. బాధ్యులపై రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. తన తల్లి ఆధార్ కార్డును ఫోర్జరీ చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న డాక్టరు రవికిరణ్, అతని తల్లి జె.లక్ష్మి, రిజిస్ట్రేషన్ చేసుకున్న సురేశ్‌బాబు, సాక్షి సంతకాలు చేసిన చంద్రప్ప, రవికుమార్‌తో పాటు డాక్యుమెంట్ రైటర్ రవిపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఫిర్యాదు చేశారు. ఆరుగురిపై ఫోర్జరీ, మోసం చేశారనే దానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ సీఐ సూర్యమోహన్‌రావు తెలిపారు.

అనుకూలమైన విత్తనం..
అనువైన రకం



ఉమ్మడి కర్నూలు జిల్లాలో రబీ సీజన్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఏయే నెలల్లో, ఏయే రకాల పంటలు సాగుకు అనుకూలమో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలియజేశారు. విత్తుకునేందుకు అనువైన సమయం తదితర అంశాలను ఆయన వివరించారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

రబీలో పంటల సాగుకు సమాయత్తం

నల్లరేగడి నేలలు - అనుకూలం	పంట	రకాలు
అక్టోబరు 15 - నవంబరు 15	సెనగ	నంద్యాల సెనగ-452, 857, 776, 49
అక్టోబరు 15 - నవంబరు 15	కుసుమ	ఐఎస్ఎఫ్-764, డీసీహెచ్ 185
నవంబరు 15 - డిసెంబరు 15	పొద్దుతిరుగుడు	ప్రభాత్ ఏడీఎస్‌హెచ్-1012
అక్టోబరు 15 - నవంబరు 15	మినుము	ఎల్బీజీ 752, 787, 904, టీబీజీ-104, 129
అక్టోబరు 15 - నవంబరు 15	జొన్న	నంద్యాల తెల్లజొన్న-4, 5, నంద్యాల పచ్చజొన్న-14

ఎర్ర నేలలు - అనుకూలం	పంట	రకాలు
అక్టోబరు 15 - నవంబరు 15	మినుము	ఎల్బీజీ-752, 787, 904, టీబీజీ-129
అక్టోబరు 15 - నవంబరు 15	పెసర	ఐఎస్ఎఫ్-764, డీఎస్‌హెచ్-185
అక్టోబరు 15 - నవంబరు 15	జొన్న	నంద్యాల తెల్లజొన్న 4, 5 రకాలు, నంద్యాల పచ్చజొన్న 14
నవంబరు 15 - డిసెంబరు 15	వేరుసెనగ	విశిష్ట టీసీజీఎస్ 1694 రకం



బనగానపల్లి మండలంలో సాగైన పొగాకు పంట

పొగాకు తడిస్తే
కుళ్లు తెగులు

బనగానపల్లి, న్యూస్‌టుడే: ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి పొగాకు పంటలో తెగుళ్లు సోకే ప్రమాదముందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎం.బాలరాజు సూచించారు. పంట వేసి ఇప్పటికి 30 నుంచి 40 రోజులవుతోందన్నారు. కొన్నిచోట్ల ఇంకా నాటుతున్నారని తెలిపారు. ఈసారి జిల్లాలో సుమారు 15 వేల ఎకరాలకుపైగా సాగు చేసినట్లు తెలిసింది. ఎడతెరిపి లేని వర్షాలతో పొగాకు పంట కొన్నిచోట్ల నేల రాలిపోతోందన్నారు. ఇప్పటికే నెల రోజులు దాటిన పంటలో వర్షంతో తెగుళ్లు సోకే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల నాటిన పొలాల్లో నీరు ఎక్కువై పంట మునకకు గురవుతోందన్నారు. నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడి వస్తుందన్నారు.

నేల రాలితే : వర్షానికి పొగాకు నేల రాలితే 19.19.19 మందును లీటరు నీటికి 6 నుంచి 8 గ్రాములు పిచికారీ చేసుకోవాలి. లేదా యూరియా 10 గ్రాములు లీటర్ నీటికి పిచికారీ చేసుకొని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కుళ్లు తెగులు : ప్రధానంగా ఈ వర్షానికి కుళ్లు తెగులు వస్తుంది. ఈ తెగులు కింద నుంచి పైకి పాకి ఆకులు మాడిపోతాయి. దీని నివారణకు రిడోమిల్ మందును 2 గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరిన్ మందును 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. కుళ్లిన పొగాకును తీసి వేయాలి.

రైతేరాజు

జీవ ఎరువుతో చామంతి వికాసం

హాలహర్వి, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలతో చామంతి తోటలో ఎండు తెగులు వ్యాప్తి చెంది మొక్కలు జీవం కోల్పోతున్నాయి. వర్షం నీరు ఎక్కువగా నిలిచినా, భూమిలో తేమ ఎక్కువగా ఉన్నా మొక్కలు పసుపు రంగులోకి మారి వాలిపోతాయి. తెగులు సోకిన మొక్కల ఎదుగుదల ఆగిపోతుంది. నేలలో జీవ ఎరువు ట్రైకోడెర్మావిరిడి వేసుకోవాలి. మొక్కలు నాటే ముందు నారును ఏదైనా శిలీంధ్రనాశనిలో ముంచి నీడలో ఆరబెట్టాలి. నేలలో ఉదజని సూచిక 6.5-7 ఉండేలా చూసుకోవాలి. సమర్థంగా నివారణకు సాఫ్ 2 గ్రా॥ లేదా అమిస్టార్‌టాప్ మి.లీ. లేదా థైయోఫానేట్ మిథైల్ 2 గ్రా॥ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. బైటాక్స్ 3 గ్రా॥ లీటర్ నీటికి కలిపి మొక్కలు మొదళ్లలో బాగా ముంపుగా పోయాలి. ఈ మందులను ప్రతి 15 రోజులకు ఒకసారి మారుస్తూ పిచికారీ చేస్తే తెగులును పూర్తిగా నివారించవచ్చని ఆలూరు క్లస్టర్ ఉద్యాన శాఖ అధికారిణి ఇంద్రాణి తెలిపారు.



సీతాఫలం..
ఆదాయం ఘనం



సీతాఫలం చెట్లను చూపుతున్న రైతు నారాయణరెడ్డి

మద్దికెర, న్యూస్‌టుడే: ఆ భూమిలో ఏ పంటలు సాగు చేసినా ఆ రైతుకు ఎప్పుడూ లాభాలు రాలేదు. దీంతో మూడేళ్ల కిందట సీతాఫలం మొక్కలు తెచ్చి సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన నారాయణరెడ్డి. ఆయన తనకున్న మూడెకరాల పొలంలో 1.5 ఎకరాల్లో సీతాఫలం సాగు చేపట్టారు.

1,200 మొక్కలకు రూ.48 వేలు ఖర్చు

తెలంగాణలోని జడ్చర్లలో గోల్డెన్ రకం మొక్క రూ.60 చొప్పున కొనుగోలు చేశారు. ఎకరానికి 800 మొక్కల లెక్కన 1.5 ఎకరాలకు 1,200 మొక్కలు నాటారు. ఇందుకు రూ.72 వేలు వెచ్చించారు. మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వేందుకు ఒక్కో గుంతకు రూ.40 చొప్పున రూ.48 వేలు, రవాణా, నాటేందుకు, ఇతర ఖర్చుల కింద ఇప్పటి వరకు రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు రైతు తెలిపారు. అంతే కాకుండా పొలం చుట్టూ రక్షణ కోసం కంచె ఏర్పాటుకు రూ.7 లక్షలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఇక్కడే రెండంతస్తుల గదిని నిర్మించారు. కింద గోదాముగా, పైన రైతు ఉండేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సీతాఫలానికి రసాయన ఎరువులు, పురుగుమందుల పిచికారీ కూడా తక్కువేనన్నారు.

ఎకరానికి నాలుగు టన్నుల దిగుబడి

మొక్కలు నాటిన మూడో ఏట దిగుబడి ఆరంభమైంది. ఎకరానిని నాలుగు టన్నుల దిగుబడి వస్తుందన్నారు. ఎకరానికి రూ.3 లక్షలకుపైగా ఆదాయం రానుందన్నారు. ఈ ఏడాది పంట ముగిసేలోపు పెట్టుబడి మొత్తం వస్తుందని, వచ్చే ఏడాది నుంచి వచ్చే ఆదాయమంతా లాభాలేనన్నారు. చాలా మంది తోట వద్దకే వచ్చి పండ్లను కొనుగోలు చేస్తున్నారు. కిలో రూ.60 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్తు పరికరాల అంచనా వ్యయాలు ఏపీలో ఎక్కువ

☛ సమీకృత స్వచ్ఛ ఇంధన విధానాన్ని అందిపుచ్చుకోవాలి ☛ ఏపీఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ సి.నాగార్జునరెడ్డి

ఈనాడు, కర్నూలు, వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్తు పరికరాల అంచనా వ్యయాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని అదుపు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఛైర్మన్ జస్టిస్ సి.నాగార్జునరెడ్డి అన్నారు. కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'రాష్ట్ర విద్యుత్తు సమన్వయ ఫోరం' సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. రాష్ట్రంలోని విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వ 'సమీకృత స్వచ్ఛ ఇంధన విధానం'లోని ముఖ్య అంశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అన్నిరకాల విద్యుత్తు వినియోగదారులకు ఉపయుక్తంగా ఉండేలా 2024-25 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరం వరకు వసతి కల్పన అమలులో ఉండే రాష్ట్ర విద్యుత్తు ప్రణాళికను తీర్చిదిద్దినట్లు గుర్తుచేశారు. సమీకృత స్వచ్ఛ ఇంధన విధానానికి అనుగుణంగా ఆ రాష్ట్ర ప్రణాళికను అవసరం మేరకు పునసమీక్ష చేయాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని విద్యుత్తు సంస్థలు ఏటా డిసెంబరు నెలాఖరు కల్లా.. ఆ తర్వాత ఆర్థిక సంవత్సరానికి అమలు చేసే 'కాస్ట్‌ డేటా'ను ఏపీఈఆర్సీ అనుమతి తీసుకోవాలని గుర్తుచేశారు. ప్రతి విద్యుత్తు పంపిణీ సంస్థ పరిధిలో విద్యుత్తు నియంత్రణ మండలి తరఫున ఒక ప్రత్యేకాధికారిని నియమించనున్నామని తెలిపారు. వారు సంస్థ పరిధిలోని లైన్లు, ఉప కేంద్రాలు తనిఖీ చేసి భద్రతా చర్యల నిమిత్తం తగిన సలహాలు, సూచనలు చేస్తారన్నారు.. వాటిని కమిషన్ ఆదేశాలుగా పరిగణించి పంపిణీ సంస్థలు అమలుచేయాలని పేర్కొన్నారు. వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడమే లక్ష్యంగా విద్యుత్తు పంపిణీ సంస్థ పనిచేయాలని చెప్పారు. రాష్ట్ర విద్యుత్తు ప్రణాళిక ఉద్దేశాలు, లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈఆర్సీ సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, వెంకటరామరెడ్డి, పంపిణీ సంస్థల సీఎండీలు పి.రవి, సంతోష్‌రావు, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, ఎన్జీవోస్, సెకి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జస్టిస్ సి.నాగార్జునరెడ్డి. చిత్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ తదితరులు

కత్తి దూసి..
☛ ఫెన్సింగ్‌లో రాణిస్తున్న నంద్యాల క్రీడాకారులు
విజేతలుగా నిలిచి



నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : ఆటలపై ఆసక్తి పలువురు విద్యార్థులను విజయాల బాట పట్టిస్తోంది. నచ్చిన క్రీడలో శిక్షణ పొందుతూ.. నిత్యం సాధనతో నైపుణ్యాలు పెంపొందించుకుని పోటీల్లో విజేతలుగా నిలుస్తున్నారు. ఇదే బాటలో నంద్యాల పట్టణానికి చెందిన యువకిరణ్, నాగలక్ష్మీచరణ్‌జీత్, శిశిరగ్రేస్, శుభాష్ ఫెన్సింగ్ క్రీడను నేర్చుకుని.. పోటీల్లో సత్తా చాటుతున్నారు. ప్రత్యర్థులను చిత్తు చేస్తూ.. రాష్ట్ర, జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచి పతకాలు సాధిస్తున్నారు. మరోసారి జాతీయస్థాయికి ఎంపికవ్వాలన్న పట్టుదలతో.. ప్రస్తుతం నంద్యాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పోరాడుతున్నారు.

యువ కిరణ్.. ఆటలో మెరిసెన్

డోన్‌కు చెందిన యువకిరణ్ ప్రస్తుతం స్థానిక జడ్పీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. క్రీడలపై ఆసక్తితో 6వ తరగతి నుంచే వ్యాయామ ఉపాధ్యాయుడు సుధాకర్ దగ్గర ఫెన్సింగ్‌లో శిక్షణ పొందాడు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. 2024లో జనవరిలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో తలపడి ప్రశంసాపత్రం అందుకున్నాడు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో 2022లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ, 2023 నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానాలు సాధించాడు.



శిశిరగ్రేస్.. శుభాష్

నంద్యాల పట్టణం మిషన్ కాంపౌండ్‌కు చెందిన మిద్దె శిశిరగ్రేస్ ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. 2018 నుంచి ఫెన్సింగ్ క్రీడలో డీఎస్ఏ శిక్షకుడు లక్ష్మణ్ వద్ద శిక్షణ తీసుకుంటోంది. 2022, 2023, 2024లో జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలు అందుకుంది. 2022 నుంచి 2024 వరకు వరుసగా జిల్లా, రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించింది. అంతర్జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో విజేతగా నిలవడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు చెబుతోంది శిశిరగ్రేస్.

చరణ్‌జీత్.. ప్రత్యర్థులు చిత్తు

నంద్యాల పట్టణం ఎస్‌బీఐ కాలనీకి చెందిన నాగలక్ష్మీచరణ్‌జీత్ ప్రస్తుతం ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఫెన్సింగ్ క్రీడపై ఆసక్తితో గత మూడేళ్లు నుంచి శిక్షణ తీసుకుంటున్నాడు. కాకినాడ, నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించాడు. 2023లో కేరళలో, 2024 ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలు అందుకున్నాడు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలనే లక్ష్యంతో మెలకువలు నేర్చుకుంటూ సాధన చేస్తున్నట్లు చెబుతున్నాడు చరణ్‌జీత్.





దివ్యాంగులకు చేయూత

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా ముగ్గురికి టచ్ ఫోన్లు, ఒకరికి ల్యాప్‌టాప్ అందించినట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఇంటర్ చదువుతున్న జి.మోహన్, ఎం.వేణు, ఎం.చందుకు స్మార్ట్ టచ్ ఫోన్లు, డిగ్రీ చదువుతున్న రేవతికి ల్యాప్‌టాప్‌ను విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ఏడీ రయిస్ ఫాతిమా, సిబ్బంది పాల్గొన్నారు.

గిట్టుబాటుకాని ఉపాధి.. వలస మేలంటున్న కూలీ

కోసిగి మండలం నుంచి వలసలు మొదలవడంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. సోమవారం కోసిగి, చిర్తన్‌కల్, దుద్ది, పల్లెపాడు, చిన్నభూంపల్లి, ఆర్లబండ, కామనదొడ్డి, అగసనూరు, సాతనూరు, కందుకూరు, జంపాపురం, సజ్జలగూడెం, ఐరన్‌గల్, గౌడగల్, కోల్మన్‌పేట, వందగల్లు, నేలకోసిగి గ్రామాల ప్రజలు బొలెరో వాహనాలు, రైళ్లలో బతుకుదెరువుకు పిల్లాపాపలతో మూటముల్లె సర్దుకుని తెలంగాణ, కర్ణాటక, గుంటూరు ప్రాంతాలకు పయనమయ్యారు. స్థానికంగా ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నా ఒక మనిషికి రోజువారీ కూలీ రూ.250 వస్తోందని, ఈ కూలీతో అప్పులు తీర్చడం, కొత్త ఇల్లు కట్టుకునేందుకు చేసిన రుణాలు తీర్చడం కష్టమవుతుందని, అందుకే వలస వెళ్తున్నట్లు కూలీలు చెబుతున్నారు. వలస వెళ్లిన ప్రాంతంలో పత్తి తీస్తామని, ఒక కిలో రూ.15 చొప్పున ఒక్కరు 90 కిలోలు తీస్తారని తెలిపారు. సాయంత్రానికల్లా రూ.1,350 కూలీ వస్తుందన్నారు. ఒక ఇంట్లో నలుగురు వ్యక్తులు ఉంటే రోజుకు రూ.4,500 కూలీ పడుతుందని, ఉపాధి పనులపై ఎందుకు ఆసక్తి చూపిస్తామంటున్నారు.

– న్యూస్‌టుడే, కోసిగి





ఎర్ర తెగులు.. పత్తి రైతుకు దిగులు



పత్తి రైతుకు ఈ ఏడాది కష్టకాలం దాపురించింది. ఓవైపు వర్షాభావం, మరోవైపు తెగుళ్ల బెడద. ప్రస్తుతం పత్తి పంటను ఎర్ర తెగులు ఆశించింది. ఎన్ని రకాల మందులు పిచికారీ చేసినా అదుపు కావడం లేదు. దీంతో కంటికి రెప్పలా కాపాడిన పంట కాపు దశలో చీడపీడలు ఆశించడంతో రైతులు గొర్రెలకు వదిలేస్తున్నారు. పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన చిలకలడోన గోవింద్ 2 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మూడు నెలలపాటు కంటికి రెప్పలా కాపాడిన పత్తి పంటను ఎర్ర తెగులు ఆశించింది. ఎన్ని రకాల మందులు పిచాకారీ చేసినా పురుగు అదుపు కాకపోవడంతో చేసేది మీలేక గొర్రెలకు వదిలేసినట్లు పేర్కొన్నారు. సేద్యం, విత్తనం, కలుపు, ఎరువులు, పిచికారీ మందులు కలిపి ఎకరానికి రూ.30 వేల చొప్పున రెండెకరాలకు రూ.60 వేలు పెట్టుబడి పెట్టగా రూ.30 వేలు మాత్రమే వచ్చాయని వాపోయారు.

– న్యూస్‌టుడే, పెద్దకడబూరు

ఉర్దూ వర్సిటీకి నిధుల కేటాయింపు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీకి సంబంధించి పరిపాలన నిమిత్తం 2024-25 విద్యా సంవత్సరానికిగానూ రూ.80 లక్షలు కేటాయిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.80 లక్షల నిధుల్లో మొదటి విడతలో భాగంగా రూ.40 లక్షలను వర్సిటీ ఖాతాలో జమ చేస్తున్నట్లు పేర్కొంది.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారానికి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సబిహా పర్వీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ సాహితీ వేత్తలు, ఉర్దూ భాషా సేవకులకు జీవితకాల సాఫల్య పురస్కారంతోపాటు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, ఉత్తమ విద్యార్థి పురస్కారం అందజేస్తున్నట్లు చెప్పారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారం కింద రూ.1.25 లక్షలతోపాటు ప్రశంసా పత్రం, డాక్టర్ అబ్దుల్ హక్ ప్రాంతీయ స్థాయి పురస్కారం కింద రూ.లక్షతోపాటు ప్రశంసా పత్రం అందిస్తున్నట్లు చెప్పారు. అర్హులైనవారు సంబంధిత పత్రాలతో 25వ తేదీలోపు విజయవాడలోని రాష్ట్ర ఉర్దూ అకాడమీలో నేరుగా లేదా పోస్టు ద్వారా పంపవచ్చన్నారు.

ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో ఆరు మండలాల్లో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం కురిసింది. కల్లూరులో 14.6 మి.మీ. పడింది. కర్నూలు అర్బన్ 9.6, కర్నూలు రూరల్ 6.4, తుగ్గలి 5.4, హొళగుంద 4.6, ఆలూరులో 1.2 మి.మీ. కురిసింది. జిల్లా సగటున 1.6 మి.మీ.గా నమోదైంది. ఈనెల సాధారణ వర్షపాతం 110.2 మి.మీ. కాగా ఇప్పటి వరకు 80.7 మి.మీ. పడింది.

పిన్నాపురాన్ని సందర్శించిన విదేశీ బృందం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని పిన్నాపురం గ్రామంలో గ్రీన్‌కో సంస్థ నిర్మిస్తున్న విద్యుదుత్పత్తి కేంద్రాన్ని విదేశీ బృందం సోమవారం పరిశీలించింది. బృందం సభ్యులు ట్రయల్ రన్ నిర్వహించి జల విద్యుదుత్పత్తిని పరిశీలించినట్లు స్థానికులు తెలిపారు. విదేశీ బృందం పర్యటన నేపథ్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ వివరాలేవీ బయటకు రాకుండా గ్రీన్‌కో సంస్థ గోప్యంగా ఉంచింది.

విచారించి న్యాయం చేయండి



బాధితుడి సమస్య వింటున్న ఎస్పీ జి.బిందుమాధవ్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు కొత్తపేటలోని బంగ్లా క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన 100 మంది బాధితులు తమ సమస్యలు విన్నవించి వినతులు అందజేశారు. విచారణ జరిపించి చట్టపరిధిలో న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

◆ ఉద్యోగాల పేరుతో తమను మోసగించారని.. న్యాయం చేయాలని గూడూరు మండలం గుడిపాడుకు చెందిన దుబ్బన్న, కర్నూలుకు చెందిన వినయ్‌గౌడ్, షేక్ సల్మాన్, ఆదోనికి చెందిన ప్రవీణ్ ఫిర్యాదు చేశారు.

◆ ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన కార్తీక్ అనే వ్యక్తి రూ.7 లక్షలు తీసుకుని మోసగించాడని గూడూరు మండలం నాగలాపురానికి చెందిన సలీమ ఆవేదన వ్యక్తం చేశారు.

◆ అత్తామామలు తన బంగారం తీసుకుని ఇవ్వటం లేదని కర్నూలు మండలం పసుపల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి విన్నవించుకున్నారు.

◆ పెద్ద కుమారుడు ఇంటిని తీసుకుని తన బాగోగులు పట్టించుకోకుండా భిక్షాటన చేయిస్తున్నాడని కర్నూలుకు చెందిన మునెమ్మ ఫిర్యాదు చేశారు.

దిగువకు 53,419 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయం నుంచి దిగువకు 53,419 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని జలాశయ ఇంజినీర్ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నాటికి 54,270 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా జలాశయంలో 1.235 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

పంచాయతీల పరిధిలోకి తీసుకురండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతాపరెడ్డి, లెనిన్

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: సచివాలయాలను గ్రామ పంచాయతీల పరిధిలోకి తీసుకురావాలని పంచాయతీరాజ్ ఛాంబరు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి కోరారు. ఆయన సోమవారం పలువురు సర్పంచులతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. సచివాయాల విధానంతో ఆశించిన ప్రయోజనం కలగడం లేదని చెప్పారు. ప్రతి పంచాయతీకి సచివాలయం ఏర్పాటుచేయాలంటూ గత మూడేళ్లుగా పంచాయతీరాజ్ ఛాంబరు పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లెనిన్‌బాబు, సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలపీరా, జిల్లా కార్యదర్శి ఖలీలుల్లా తదితరులు ఉన్నారు.

సహకార సంఘ కార్యవర్గం రద్దుకు సిఫారసు

స్పందనకు వందనం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నాలుగో తరగతి ఉద్యోగుల గృహ నిర్మాణ సహకార సంఘంలో జరిగిన అవినీతిపై 'అక్రమాల పునాదులు' శీర్షికన ఈనెల 9వ తేదీన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. మరోవైపు బాధితులు, ప్రజా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జేసీ డా.బి.నవ్యను కలిసి తమకు న్యాయం చేయాలని విన్నవించారు. జేసీ తక్షణమే స్పందిస్తూ జిల్లా సహకార అధికారి ఎన్.రామాంజనేయులును పిలిపించారు. ప్రస్తుత గృహ నిర్మాణ సంఘ కార్యవర్గాన్ని రెండు రోజుల్లో రద్దు చేసి కొత్తగా ప్రత్యేకాధికారిని నియమించాలని ఆదేశించారు. బాధితుల నుంచి ముగ్గురు సభ్యులతో తాత్కాలిక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు నాగన్న, బాధితుల సంఘం నేతలు జెట్టి కృష్ణ, కుమారస్వామి, ప్రజా పరిరక్షణ సమితి నాయకులు డేవిడ్, బేగ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నాలుగో తరగతి ఉద్యోగుల గృహ నిర్మాణ సంఘం బాధితులు

విద్యుదాఘాతంలో మహిళా కార్మికురాలి మృతి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఓ కొత్త ఇంటి నిర్మాణ పనులకు వెళ్లిన మైముదాబేగం(40) అనే వివాహిత సోమవారం విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు. . ఆదోని పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో టైలర్ నిసార్‌అహ్మద్, మైముదాబీ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోమవారం ఓ ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా ఇంటికి క్యూరింగ్ కోసం నీటి విద్యుత్తు మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పోలీసులు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

నందవరం, న్యూస్‌టుడే: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండలంలోని నాగలదిన్నె గ్రామంలో చోటుచేసుకుంది. నందవరం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నాగలదిన్నెకు చెందిన వడ్డె ఉరుకుందు (50) మద్యానికి బానిసయ్యాడు. ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో రూ.40 వేలు రుణం తీసుకుని రూ.20 వేల మద్యానికి ఖర్చు చేశారు. మిగతా రూ.20 వేలు ఇంట్లో ఇచ్చారు. దీంతో ఉరుకుందు భార్య సావిత్రి, కొడుకు ఉరుకుందు ఆయన్ని మందలించారు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పోక్సో చట్టం కింద యువకుడి అరెస్టు

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన గొల్లకృష్ణ ఉరుకుందు అనే యువకుడు ఓ బాలుడిపై అసహజ లైంగిక దాడికి పాల్పడటంతో ఆదివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ఉపేంద్ర బాబు, పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో సోమవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు పంపామన్నారు.

బాలికపై దొంగతనం నెపం

◆ పోలీసుల తీరుతో ఆత్మహత్యాయత్నం
◆ పరిస్థితి అత్యంత విషమం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ఓ బాలికపై దొంగతనం నెపం మోపడంతో ఆత్మహత్యయత్నానికి పాల్పడగా కర్నూలు సర్వజన ఆస్పత్రిలో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లాకు చెందిన ఓ సీడ్ వ్యాపారి తన ఇంట్లో గత కొంతకాలంగా మల్దకల్ మండలానికి చెందిన బాలిక చేత వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాడు. ఈ క్రమంలో తన ఇంట్లో బంగారం పోయిందంటూ సదరు వ్యాపారి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బాలికను పోలీసుస్టేషన్‌కు పిలిపించి అవమానకరంగా మాట్లాడారు. దీనిని భరించలేక బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు వెంటనే గద్వాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈనెల 18న కర్నూలు సర్వజన ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆదివారం మధ్యాహ్నం ఆరోగ్యం మరింతగా విషమించడంతో వైద్యులు ఏఎంసీలో ఉంచి వెంటిలేటరుపై చికిత్స అందిస్తున్నారు.

ఆదోని

•ఆదోని •ఆలూరు •పత్తికొండ

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

మద్దికెర, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మద్దికెర మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వివిధ రకాల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు హుస్సేన్‌సాహెబ్, ఎంపీపీ అనిత, తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై అట్రాసిటి కేసు

ఆస్పరి, న్యూస్‌టుడే: నగరూరు గ్రామానికి చెందిన నలుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఆస్పరి సీఐ మస్తాన్ వలి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బాలుడిపై బాలిక కుటుంబ సభ్యులు గోపి, వినోద్, ఉపేంద్ర, శ్రీనివాసులు కలిసి దాడి చేయడంతో పాటు కులంతో దూషించారని ఫిర్యాదు చేశారాన్నారు. బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు సీఐ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

హొళగుంద, న్యూస్‌టుడే: **సమస్య:** గజ్జహళ్లి గ్రామం బీసీ కాలనీలో మురుగుకాల్వలు లేక మురుగు నీరు రోడ్లపై ప్రవహించి, పరిసరాలంతా అపరిశుభ్రంగా ఉంది.
– కుమార్, గజ్జహళ్లి

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం.
– రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి, గజ్జహళ్లి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: **సమస్య :** ఆదోని పట్టణ శివారులోని శిరుగుప్ప చెక్‌పోస్టు సమీపంలో అపరిశుభ్రత నెలకొంది. కుళ్లిపోయిన పండ్లు, కూరగాయలు ఇతరాత్ర పదార్థాలను రహదారిపై పారబోశారు. పరిసరాలు కంపుతో ఇబ్బందులు పడుతున్నాం.
– లక్ష్మన్న, ఆదోని

సమాధానం : ప్రజారోగ్య విభాగం ద్వారా శుభ్రత చర్యలు చేపట్టి సమస్య దూరం చేస్తాం.
– కృష్ణ, కమిషనరు, ఆదోని పురపాలక సంఘం

మద్దికెర, న్యూస్‌టుడే: **సమస్య:** మద్దికెరలోని పోలీసు స్టేషన్ వెనుకభాగంలో ఆక్రమణలు తొలగించిన ప్రాంతంలో సిమెంటు రహదారి నిర్మించాలి.
– రామాంజనేయులు, మద్దికెర

సమాధానం: కూరగాయల మార్కెట్ సౌకర్యార్థం ఆక్రమణల తొలగింపు చేపట్టాం. వెంటనే ఆ ప్రాంతంలో సిమెంటు రహదారి నిర్మిస్తాం.
– శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర

పంట దెబ్బతింది.. న్యాయం చేయండి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని పట్టణంలోని ఓ ఎరువులు, పురుగు మందుల దుకాణంలో వరి పంటకు సంబంధించి ఓ మందు కొనుగోలు చేసి, పిచికారీ చేస్తే.. ఆ పంట మొత్తం దెబ్బతిందని హొళగుంద మండలం హెబ్బటం గ్రామానికి చెందిన రైతు నర్సప్ప తెలిపారు. పలుమార్లు దుకాణ నిర్వాహకుడికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. తనకు న్యాయం చేయాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వృత్తివిద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్దుర్తి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామనాయక్ అన్నారు. పాఠశాలలో వృత్తివిద్యా శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులను స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకున్న పరిశ్రమలు, ముద్రణ యంత్ర దుకాణాలకు తీసుకెళ్లారు. పరిశ్రమల పనితీరును వివరించారు. కార్యక్రమంలో వృత్తివిద్యా ఉపాధ్యాయులు దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలి

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరులోని హొళగుంద వెళ్లే మార్గంలో బీసీ బాలుర కళాశాల వసతిగృహం సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు మైనా, గోవర్ధన్, ఉమేశ్, ఐద్వా మండల అధ్యక్షురాలు షేకన్‌బీ డిమాండు చేశారు. విద్యార్థులతో కలిసి తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నాకు దిగారు. అనంతరం తహసీల్దారు, ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నారాయణస్వామి, కృష్ణ, ఈరన్న పాల్గొన్నారు.

వైద్య కళాశాల పనులు పూర్తిచేయాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తిచేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, ఖాజ అన్నారు. కర్నూలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, సుభాన్ భాష, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నాం..

○ భూ సర్వే సమస్యలతో సతమతం
○ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు

కనికరించండయ్యా

గ్రామంలో 1.32 ఎకరాల భూమి ఉందని, ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు నమోదు అయిందని, విచారణ చేసి, సమస్య పరిష్కరించాలని ఆదోని మండలం మండిగిరికి చెందిన మల్లికార్జున స్వామి ఆదోని సబ్ కలెక్టర్ భరద్వాజ్‌ను కోరారు. పలువురు భూ సమస్యలు విన్నవించారు.

పత్తికొండ గ్రామీణం, పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించే లక్ష్యంతో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసినట్లు గత వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పింది. ఐదేళ్లలో గ్రామ స్థాయిలో సమస్య పరిష్కారం కాక మండల కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎలాంటి ఫలితం లేదని బాధితులు వాపోతున్నారు. జగన్ పాలనలో చేపట్టిన భూ రీసర్వేలో తలెత్తిన లోటు పాట్ల కారణంగానే అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి సోమవారమే కాకుండా మిగతా రోజుల్లోనూ కార్యాలయాల చుట్టూ తిరగలేక వేసారి పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిలో భూసర్వే కారణంగా భూ విస్తీర్ణం తగ్గిన వారు కొందరైతే. ఆన్‌లైన్లో వేరే వాళ్ల పేర్లు కనిపిస్తున్నాయని కొందరు, ఉమ్మడి సాగులో భాగంగా ఎల్పీఎం సంఖ్యలు తప్పుగా చూపుతున్నాయని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు తమ సమస్యలను ఇలా వివరిస్తున్నారు.

విస్తీర్ణం తగ్గింది

– హనుమంతు, చిన్నహుల్తి



గ్రామ రెవెన్యూ పరిధిలోని 398 సర్వేనెంబర్‌లో తమ పొలం 2.32 ఎకరాలకు గానూ 1.80 ఎకరాలు మాత్రమే చూపుతోంది. భూసర్వే కారణంగానే తమకు ఉండాల్సిన భూమి తగ్గిపోయింది. ఎంతో విలువైన భూమి కోల్పోయి ఆవేదనతో కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నా. ఇప్పటికే ఐదారు సార్లు వినతి పత్రాలు ఇచ్చాను. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఆన్‌లైన్‌లో ఇతరుల పేరు ఉంది

– రామాంజనేయులు, పత్తికొండ



సర్వేనెం. 1007-7, 1007-8బీ లో ఉన్న రెండున్నర ఎకరాలు తన మొత్తం పొలాన్నీ వేరే వాళ్ల పేరుతో ఆన్‌లైన్ చేశారు. ప్రస్తుతం ఒక్క సెంటు కూడా తన పేరుపై భూమి చూపటంలేదు. భూమిపై బ్యాంకులో రూ.60వేలు పంట రుణం తీసుకున్నాను. నాపేరు మీద ఆన్‌లైన్ భూమి కనిపించకపోవటంతో బ్యాంకు వారు తీసుకున్న మొత్తం రుణం చెల్లించాలని కోరుతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా కనికరించడంలేదు.

II సెంట్లు మాయం

– తిప్పేనాయక్, మర్రిమానుతండా



సర్వే నెం. 15-13లో ఉన్న 1.06 సెంట్ల తన భూమిని గ్రామానికి చెందిన ఓ మహిళా రైతు పేరుపై ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేయించారు. సమస్య పరిష్కారం చేయాలని, తన భూమి తనకు ఇప్పించాలని కోరుతూ మూడేళ్లుగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోవటంలేదు. అదిగో ఇదిగో అంటున్నారు తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవటంలేదు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

– రమేశ్, పత్తికొండ తహసీల్దారు

ఇప్పటి దాకా పరిష్కారం కాని భూసంబంధ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలను సైతం గ్రామసభల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు సమస్యలున్న రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నాం. తమ పరిధిలో లేని అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

వారసత్వం కింద వచ్చిన ఆస్తే..

– పూజారి పెద్దహుల్తెన్న దంపతులు, పెద్దహుల్తి



తన తండ్రి వారసత్వం నుంచి వచ్చిన సర్వే నెం.29-1సీ లో ఉన్న 3.70 ఎకరాల పొలానికి గానూ కేవలం 3.40 ఎకారాలు మాత్రమే తనపేరుపై ఉందనీ, మిగతా పొలాన్ని ఆన్‌లైన్ చేసి పాసు పుస్తకం ఇవ్వాలని కోరుతూ కార్యాలయం చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతున్నా పట్టించుకోవటంలేదు. రైతు సదస్సుల్లో భాగంగా నిర్వహించే గ్రామ సభల్లోనైనా సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని కోరుతున్నా.

చిన్నారులకు దాతల ఆసరా

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులకు చేయూత అందించేందుకు దాతలు ముందుకొస్తున్నారు. తల్లి దూరమై ఒంటరి వారైన చిన్నారుల దీనావస్థపై సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'అక్కా.. అమ్మ నిద్రపోయిందా' అనే అకథనానికి మానవతావాదులు స్పందించారు. దాతలు సుమారు రూ.లక్షకు పైగా ఆర్థిక సాయం అందించినట్లు మృతురాలి బంధువులు తెలిపారు. చందోలి, మారెళ్ల గ్రామస్థతో పాటు ఇతరులు ముందుకొచ్చారు. లక్ష్మి భర్త అంజనయ్య స్వగ్రామమైన మారెళ్లలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.


చిన్నారులకు ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

అర్జీల పరిశీలనలో నిర్లక్ష్యం చేయొద్దు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దని, అధికారులు బాధ్యతగా పని చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆదోని పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశులు, డీఎల్‌పీవో నూర్జహాన్, డీఎల్‌డీవో ప్రభాకర్‌రెడ్డి, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ పద్మజ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సత్యవతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వేణుసూర్య, శ్రీనివాసరాజు, ఆర్డీవో నాగేంద్ర, ఆదోని ఏడీఏ అరుణకుమారి పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ భరద్వాజ్‌కు సమస్యలు విన్నవిస్తున్న అర్జీదారులు

ఏజెంట్లపై నిర్లక్ష్య ధోరణి తగదు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఎల్ఐసీ ఏజెంట్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఆ సంఘం నాయకులు అన్నారు. ఆదోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట సోమవారం ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఆలిండియా లియాఫీ పిలుపు మేరకు ధర్నా చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎల్ఐసీ ఏజెంట్లకు ఇచ్చే పాత కమీషన్ పద్ధతి అమలు చేయాలని, పాలసీదారులకు బోనస్ పెంచాలని, బీమా ప్రీమియం సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎల్ఐసీ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్న ఏజెంట్లను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. లియాఫీ డివిజన్ అధ్యక్షుడు జయభారత్‌రెడ్డి, ఆదోని అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, శిద్ధలింగ, నాయకులు ఈరన్న, రఘు, తిప్పన్న, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏజెంట్లు

చిన్నారుల వ్యాసం.. స్ఫూర్తి సందేశం

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని వింధ్యశ్రీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, పదో తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చాటిన వారిని ఎంపిక చేశారు. ప్రథమ స్థానంలో కె. అభిలాష్‌రెడ్డి, ద్వితీయ స్థానంలో కె.వాసవి, తృతీయ స్థానంలో కె.సాగర్ నిలిచారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జ్యోతి, ఉపాధ్యాయులు శ్వేతామాయ, లలిత, శివజ్యోతి, ప్రతాప్, నిత్యానంద తదితరులు పాల్గొన్నారు.





అమర వీరుల పోరాటం.. ప్రజా రక్షణే ధ్యేయం

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: నిత్యం ప్రజా రక్షణే ధ్యేయంగా రక్షకులు పోరాడుతారని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. పత్తికొండ పట్టణం ఠాణాలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అమరవీరులకు నివాళి అర్పించారు. బాలికోన్నత పాఠశాలలో కూడా అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని భ్రమరాంబ, శిక్షణ డీఎస్పీ ఉషశ్రీ, సీఐ జయన్న, వాల్మీకి నాయకులు శ్రీనివాసులు, గోవర్ధన్‌నాయుడు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి, న్యూస్‌టుడే: సమాజానికి ఆదర్శంగా నిలిచిన పోలీసు అమర వీరులను స్మరించుకుందామని వెల్దుర్తి, కృష్ణగిరి ఎస్సైలు అశోక్, మల్లికార్జున అన్నారు. వెల్దుర్తి పోలీసు స్టేషన్ నుంచి పాతబస్టాండులోని తెలుగుతల్లి విగ్రహం వరకు పోలీసులు కవాతు చేపట్టారు.


పత్తికొండ ఠాణాలో నివాళి అర్పిస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య, సీఐ జయన్న, శిక్షణ డీఎస్పీ ఉషశ్రీ తదితరులు


బాలికోన్నత పాఠశాలలో పాల్గొన్న విద్యార్థులు


వెల్దుర్తి: కవాతు చేపట్టిన పోలీసులు

పల్లె కబుర్లు

చాగి (ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: చాగి, ఢణాపురం, బైచిగేరి గ్రామాల్లో బనవాసి కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త రాఘవేంద్ర, కర్నూలు డీఆర్‌సీ ఏడీఏ గిరిష్, ఆదోని ఏడీఏ అరుణకుమారి సోమవారం పత్తి పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆదోని వ్యవసాయ అధికారి అశోక్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కోతిరాళ్ల(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: కోతిరాళ్లలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం వేరుసెనగ పంట కోత ప్రయోగం చేపట్టారు. ఎన్ఎస్ఎస్‌వో సతీశ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రియాజ్, రైతు సేవా కేంద్రం వీఏఏ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

బొమ్మిరెడ్డిపల్లి(వెల్దుర్తి), న్యూస్‌టుడే: బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలోని పామయ్యతాత ఆలయ ఆవరణలో వెలసిన గురు హనుమంత్ తాత ఆరాధనోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అఖండ భజనలు, నందికోల సేవలు చేశారు.

ఎద్దులదొడ్డి (తుగ్గలి), న్యూస్‌టుడే: రీసర్వే జరిగిన గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోంది. ఎద్దులదొడ్డి గ్రామంలో మంగళవారం గ్రామసభ ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి తహసీల్దారు నాగరాజు తెలిపారు.

తుగ్గలి, న్యూస్‌టుడే: ఎండీయూ ఆపరేటర్లు సరకులను అంగన్‌వాడీ కేంద్రాలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీల సంఘం నాయకురాల్లు కాంతమ్మ, రమిజాబి తదితరులు ఇన్‌ఛార్జి తహసీల్దారు నాగరాజును సోమవారం కోరారు. నెల నెలా సరకులు చౌకదుకాణాలు నుంచి కేంద్రాలకు తెచ్చేందుకు అంగన్‌వాడీ సహాయకులు ఇబ్బంది పడుతున్నారని వారు అధికారికి వివరించారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: తల్లి లక్ష్మి మృతిచెందగా అనాథలుగా మారిన చిన్నారులను సోమవారం మారెళ్ల గ్రామంలో ఐసీడీఎస్, ఐసీపీఎస్ అధికారులు పరామర్శించారు. చందోలి గ్రామంలో ఏడో తరగతి చదువుతున్న జయశ్రీని పత్తికొండ కేజీబీవీలో చేర్పిస్తామని, మిగతా ఇద్దరు చిన్నారులను ఐసీడీఎస్ ప్రాంతీయ కార్యాలయ సమీపంలో ఉన్న బాల సదనంలో చేర్పించి వారి చదువులు కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ పత్తికొండ ప్రాజెక్టు అధికారిణి లలిత అన్నారు.

చెరువును చేరిన జలకళ



దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండలో రెండు చెరువులు నిండు కుండాలా మారాయి. హంద్రీనీవా నుంచి చెరువులోకి నీటిని మళ్లించడం, వర్షాలు తోడవడంతో నీరు సమృద్ధిగా చేరింది. రెండు చెరువులకు ఆయకట్టు భూములు లేవు. వ్యవసాయ బోర్లలో భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పెద్ద చెరువులైన మాచాపురం, నేలతలమర్రి చెరువులకు ఆయకట్టు ఉన్నా.. చుక్క నీరు లేకపోవడం గమనార్హం. హంద్రీనీవా ద్వారా ఈ రెండు చెరువులకు నీరందించాలని 8 ఏళ్లుగా రైతులు డిమాండు చేస్తున్నారు. ఈసారైనా కూటమి ప్రభుత్వం స్పందిస్తే వేలాది ఎకరాలల్లో పంటలు పండించుకోవచ్చని ఆయా గ్రామాల రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

వీరు మంజూరు చేస్తే.. వారు రద్దు చేశారు

చిప్పగిరి, న్యూస్‌టుడే: చిప్పగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ లేక రక్షణ కరవైంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విశాల ప్రాగణంలో మొక్కలు పెంచి, క్రీడా మైదానంగా తీర్చిదిద్దుకున్నారు. ఇతరులు, పశువులు వచ్చి నాశనం చేస్తున్నాయని అధ్యాపకులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018లో ఉపాధి హామీ పథకం నిధులతో రూ.40 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి తెదేపా సర్కార్ నిధులు మంజూరు చేసింది. వైకాపా అధికారంలోకి వచ్చాక రద్దు చేసింది. మళ్లీ తెదేపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రహరీ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ఇకపై భూకబ్జాలు జరగవని, ఆ మాట వినిపించదని అలా చేసే వారిని వదిలిపెట్టనని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సోమవారం మాట్లాడారు. పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో భూకబ్జా విషయం పత్రికల ద్వారా తెలుసుకున్నానని, బాధితులు తనను స్వయంగా కలవడం గానీ, ఫిర్యాదు చేయడం కానీ జరగలేదన్నారు. తాను సుమోటాగా స్పందించి 48 గంటల్లో జరిగిన రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించడంతో పాటు అక్రమాలకు పాల్పడిన వ్యక్తిపై చర్యలకు సిఫార్సు చేశానన్నారు. సమావేశంలో జనసేన బాధ్యుడు మల్లప్ప, తెదేపా రాష్ట్ర నాయకులు దేవేంద్రప్ప, భాజపా నాయకులు నీలకంఠ, ఉపేంద్రకుమార్, నాగరాజుగౌడు, మధుసుదన్ శర్మ, తెదేపా నాయకులు ఉమ్మి సలీం, ఫక్రుద్దీన్, గుడిసె కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: నిరుద్యోగులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదోని డాక్టర్ జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మురళీబాబు, కళాశాల ఉపాధ్యక్షుడు రఘురామయ్య అన్నారు. ఆదోని డాక్టర్ జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో సోమవారం నేషనల్, మల్టీనేషనల్ కంపెనీల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఆదోని డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వేయి మంది నిరుద్యోగ యువతీయువకులు పాల్గొన్నారు. తమకు అవసరమైన, నైపుణ్యం ఉన్న వారిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ స్వామినాథ్, ఐక్యూఏఎస్ డైరెక్టర్ చంద్రశేఖర్, హెచ్ఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళాలో మాట్లాడుతున్న కరస్పాండెట్ మురళీబాబు

పురవాసులకు రహదారి కష్టాలు

ఆదోని పురపాలకం, ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని పుర రహదారులు గోతులమయంగా మారాయి. పట్టణంలోని గోకర్‌జెండ ప్రాంతంలో, రాంజలకు వెళ్లే ప్రధాన రహదారి కంకరతేలి గుంతలమయంగా మారింది. ఈ రహదారి మీదుగా రోజూ వేలాది ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పాఠశాలలు అధికంగా ఉండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. పట్టణంలోని డీఎస్పీ బంగ్లా-రైల్వేగేటు ప్రధాన రహదారి పరిస్థితి మరీ దారుణంగా మారింది. పుర అధికారులు స్పందించి గుంతలమయంగా మారిన రహదారిని మరమ్మతులు చేపట్టి గుంతలను మూయించాల్సిన అవసరం ఉంది.

అధ్వానంగా ఆదోని డీఎస్పీ బంగ్లా-రైల్వేగేటు ప్రధాన రహదారి



గుంతలమయంగా మారిన రాంజలకు వెళ్లే ప్రధాన రహదారి


బురదమయంగా బసాపురం రహదారి

ఇదీ పరిస్థితి..

ఆదోని పట్టణంలో మార్కెట్ యార్డు ప్రాంతంలో బసాపురం రహదారిలో గోతులు ప్రమాదకరంగా మారాయి. ఈ ప్రాంతంలో పలు పరిశ్రమలతో పాటు మార్కెట్‌యార్డు ఉంది. అమరావతినగర్, బసాపురం ప్రాంతాలకు వెళ్లేందుకు ఇది అనువైన దారి. మట్టి దారి కావడంతో వర్షం వస్తే చిత్తడి మారుతోంది. భారీ వాహనాల రాకపోకల వల్ల గుంతలు ఏర్పడ్డాయి. దీని వల్ల దిగుబడి తెచ్చే రైతులు, ఎద్దుల బండ్లు ప్రమాదాలబారిన పడుతున్నాయి. రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి ఉన్నా.. ఇంతవరకు రహదారిని బాగు చేయలేదని ఇక్కడి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దేవనకొండకు బస్సు నడపాలి

దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండ మండలంలో 44 గ్రామాలున్నాయని నిత్యం రైతులు వందల సంఖ్యలో ఆదోనికి వెళ్తున్నారని బస్సు ఏర్పాటు చేయాలని డీవీఎంసీ సభ్యుడు కాకర్ల శాంతికుమార్ పేర్కొన్నారు. కర్నూలోని ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులుకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

పోలీసు సంక్షేమమే లక్ష్యం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసుల సంక్షేమం కోసమే ఆదోని పట్టణంలోని రెండో పట్టణ పోలీసు స్టేషన్ వద్ద పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆదోని డీఎస్పీ సోమన్న అన్నారు. నిర్మాణ పనులకు సోమవారం పూజలు చేశారు. ఈ బంకు ద్వారా వచ్చే ఆదాయం పోలీసు సంక్షేమ నిధికి చేరుతుందన్నారు. కార్యక్రమంలో సీఐ సూర్యమోహన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆదోనిలో పోలీసు పెట్రోల్ బంకు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఆదోని డీఎస్పీ సోమన్న

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

ఆలయానికి నాలుగు కిలోల వెండి విరాళం



వెండి అందజేస్తున్న దాతలు

కౌతాళం, న్యూస్‌టుడే: మండలంలోని చూడి ఆంజనేయ స్వామి వెండి విగ్రహ కవచం ఏర్పాటుకు రాయచూరు నగరానికి చెందిన చూడి గోవిందయ్యశెట్టి కుమారులు, చూడి వెంకటస్వామి శెట్టి కుమారులు సోమవారం నాలుగు కిలోల వెండిని విరాళంగా అందజేశారు. గ్రామ పెద్దలు, అర్చకులు, గ్రామస్థుల సమక్షంలో అందజేశారు. ఉప్పలప్ప, పూజారి మల్లేశ్, కురువ మైలారి, మహేశ్‌స్వామి గున్నం శ్రీధర్ పాల్గొన్నారు.

26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు

నందవరం, న్యూస్‌టుడే: ఈ నెల 26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు నిర్వహించనున్నట్లు తెదేపా మండల కన్వీనర్ చిన్న రాముడు పేర్కొన్నారు. సోమవారం నందవరంలో తెదేపా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వమున్న కార్యకర్తలు మృతి చెందితే రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు బీమా సొమ్ము వస్తుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) మంత్రాలయం : 98859 97892 గోనెగండ్ల : 80085 73827

పెద్దకడబూరు: **సమస్య:** మండలంలోని హనుమాపురం గ్రామంలో చాలా రోజుల నుంచి కాల్వలు శుభ్రం చేయడం లేదు. మురుగు దుర్వాసనతోపాటు రాత్రిపూట దోమల బెడద ఎక్కువైంది. కాల్వలు శుభ్రం చేయించగలరు. – హనుమాపురం గ్రామస్థులు

సమాధానం: సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. పంచాయతీలో నిధులను అనుసరించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. – జయరాముడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పెద్దకడబూరు

నాలుగు రోజులు ఉచిత ఆధార్ సేవలు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో నాలుగు రోజులపాటు ఉచిత ఆధార్ సేవలు అందజేయనున్నట్లు ఎంపీడీవో జయరామయ్య సోమవారం తెలిపారు. ఆధార్ సమస్యలు ఉన్నవారు ఈ నెల 22 నుంచి 25 వరకు నాలుగు రోజులు శిబిరం ద్వారా నిర్వహించే సేవలను వినియోగించుకోవాలన్నారు.

గవిగట్టులో చిరుతపులి కలకలం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని గవిగట్టు గ్రామంలో సోమవారం చిరుత పులి కలకలం రేపింది. గ్రామ సమీపంలోని కొండలో చిరుత కనిపించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వారం రోజుల నుంచి చిరుత సంచరిస్తోందని, అటవీశాఖ అధికారులు బంధించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉప తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్ల ఉప తహసీల్దార్‌గా విష్ణుప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టినట్లు తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. ఈయన గతంలో డీటీవోగా కృష్ణగిరి, దేవనకొండ, పత్తికొండ మండలాల్లో పని చేసినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కొండెక్కిన దీపాలు.. వృథాగా నిధులు

■ వైకాపా హయాంలో రూ.12 లక్షల ఖర్చు

వైకాపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. గుత్తేదారులు, అధికారుల నిర్లక్ష్యంతో ఇష్టారాజ్యంగా నిధులు ఖర్చు చేశారు. రోప్ దీపాల పేరుతో నిధులు దండుకున్నారే తప్ప, ప్రజలకు మాత్రం ప్రయోజనం కలుగలేదు. ఎమ్మిగనూరు పట్టణ సుందరీకరణలో భాగంగా పురపాలక సంఘం నిధుల నుంచి రూ.12 లక్షలతో రోప్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ప్రతి విద్యుత్తు స్తంభం చుట్టూ చిన్న దీపాలు ఉండేలా రోపింగ్ చేశారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే:



పట్టణంలోని సోమప్ప కూడలి నుంచి శ్రీనివాస సర్కిల్, బస్టాండు, శివ సర్కిల్, సోమప్ప సర్కిల్ నుంచి ఓంశాంతి సర్కిల్, అన్నమయ్య సర్కిల్ నుంచి మార్కెట్ యార్డు సర్కిల్ వరకున్న జాతీయ రహదారిలో సుమారు 400కు పైగా విద్యుత్తు స్తంభాల చుట్టూ రోప్ దీపాలు అమర్చారు. లైటింగ్ తీగలు, లైట్లు కాలిపోవడంతో వృథాగా మారాయి. అందులోని స్విచ్‌లు, చిన్న బల్బులు వర్షాలకు కాలిపోయాయి. ఏడాది గడవక ముందే రోప్ లైటింగ్‌కు చీకట్లు కమ్ముకున్నాయి. ఈ పనుల్లో గుత్తేదారుడిగా వైకాపా నాయకుడు పనులు చేపట్టడంతో రూ.లక్షలు విలువ చేసే పరికరాల్లో నాణ్యత లేని వాటిని సరఫరా చేసినట్లు తెలుస్తోంది. రోప్ దీపాల వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించి ప్రమాదాలు జరుగకుండా ఉంటాయి. రూ.లక్షలు వెచ్చించినా నాణ్యత లేకపోవడంతో త్వరగా కాలిపోయాయని పురప్రజలు ఆరోపిస్తున్నారు. అన్నమయ్య కూడలిలో కొన్ని రోప్ దీపాలు వెలగడం లేదు.



ఇది పట్టణంలోని ప్రధాన రద్దీ ప్రాంతమైన ఓంశాంతి సర్కిల్. ఇక్కడ నాలుగు రహదారులు కలుస్తాయి. నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఇక్కడ పెద్ద విద్యుత్తు స్తంభానికి రోప్ లైటింగ్ ఏర్పాటు చేశారు. 20 అడుగుల మేర మూడు రంగులు వచ్చేలా అమర్చారు. కూడలి కావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు ప్రమాదాలు జరుగకుండా ఉంటుంది. స్విచ్ బోర్డు కాలిపోవడంతో దీపాలు వెలగడం లేదు. చిన్న మరమ్మతులు కూడా చేయలేక వదిలేశారు.

మరమ్మతులు చేయిస్తాం

– *గంగిరెడ్డి, పురపాలక కమిషనర్*

రోప్ లైటింగ్ కాలిపోయినచోట్ల మరమ్మతులు చేయాలని గుత్తేదారున్ని ఆదేశించాం. కొన్ని స్విచ్‌లు, దీపాలు కాలిపోయాయి. వీటికి మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. అంతేకాక కొత్త దీపాల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం.

ఇది పట్టణంలోని జాతీయ రహదారిలో విద్యుత్తు స్తంభం. దీని చుట్టూ రోప్ దీపాలు వేశారు. అన్నమయ్య కూడలి నుంచి మార్కెట్ యార్డు కూడలి వరకు సుమారు 35కు పైగా స్తంభాలకు అమర్చారు. అన్నీ దీపాలు కాలిపోయాయి. కొన్నిచోట్ల సగం కాలిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుత్తేదారుడు నిర్లక్ష్యంతో దీపాలు త్వరగా కాలిపోయినట్లు వాహనదారులు వాపోతున్నారు.

స్వయం ఉపాధికి రుణాలు

గూడూరు, న్యూస్‌టుడే: పొదుపు మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధి పెంపొందించుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ శాంతకుమారి అన్నారు. నగర పంచాయతీలో మెప్మా ఆధ్వర్యంలో సోమవారం పొదుపు మహిళలు ఏర్పాటు చేసిన ద్వారా బజారును ఆమె సందర్శించారు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించిన వారికి అవసరమైనంత తిరిగి రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ క్షేత్ర అధికారి శ్రీనివాసులు, మెప్మా సిబ్బంది వీరారెడ్డి, మద్దమ్మ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు వైద్య సేవలందించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పేదలకు వైద్య సేవలందించి సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం శివన్న నగర్ కాలనీలో సరస్వతి శిశుమందిర్ ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. నవభారత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు నరసింహులు, కామినేని ఆసుపత్రి వైద్యులు గణేశ్, రాఘవేంద్ర, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నిలిచిన పనులు.. నిరుపయోగంగా భవనాలు



వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలకు బిల్లులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు పనులను అర్ధంతరంగా ఆపేశారు. నందవరం మండలంలోని పూలచింత గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.35 లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ.36 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలు చేపట్టారు. సచివాలయం చివరి దశలో ఉండగా, ఆర్బీకే పూర్తయింది. విలేజ్ హెల్త్ క్లినిక్ రూ.5 లక్షల ఖర్చు చేసి పునాదులకే పరిమితం చేశారు. దీంతో కడ్డీలు తుప్పు పడుతున్నాయి. సచివాలయ ఉద్యోగులు పశు వైద్యశాల భవనంలో విధులు నిర్వహిస్తున్నారు.

– న్యూస్‌టుడే, పూలచింత (నందవరం)

ఇళ్ల మధ్య నీరు.. పరిశుభ్రత పరారు



కోడుమూరు మండలం అమడగుంట్ల గ్రామంలో వర్షం నీరు ఇళ్ల మధ్య నిలవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గొల్ల వీధిలో ఇళ్ల మధ్య నీరు నిలిచి దోమలు వ్యాపిస్తున్నాయని వాపోతున్నారు. గతంలో రహదారి, మురుగు వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరంతా ఇలా నిలిచిపోతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా మురుగునీటి వ్యవస్థను మెరుగుపర్చాలని వేడుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

నిధులున్నా.. నిర్లక్ష్యం మిన్న



మంత్రాలయం మండలంలోని బూదూరు గ్రామ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో ఐదు గదులు ఉండగా, ఒక గదిలో ఎనిమిదేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. నాలుగు గదుల్లో 1 నుంచి 5 తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 133 మంది విద్యార్థులు ఇరుకుఇరుకుగా కూర్చొని చదువుకుంటున్నారు. గదుల్లో మధ్యాహ్న భోజన బియ్యం సంచులు, కోడిగుడ్లు, పాఠశాల సామగ్రి ఉంచారు. గదుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ నాడు-నేడు రెండో విడతలో రెండేళ్ల కిందట రూ.35 లక్షలతో 3 గదులు మంజూరయ్యాయి. రూ.8 లక్షలతో 15 పిల్లర్లకు కడ్డీలు మాత్రమే వేసి వదిలిపెట్టారు. గతేడాది విద్యాసంవత్సరం చివరి వరకు ఖాతాలో రూ.13 లక్షలున్నా అప్పటి పాఠశాల ఛైర్మన్ పనులు చేయించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి.

– న్యూస్‌టుడే బూదూరు (మంత్రాలయం)

వ్యాసరచన పోటీలతో సృజనాత్మకత వెలికితీత





ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: వ్యాసరచన పోటీలతో విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదపడతాయని భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ కవిత అన్నారు. ఈనాడు ఆధ్వర్యంలో సోమవారం భాష్యం పాఠశాలలో ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించడమైంది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగరాజు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. పాఠశాలలో 140 మందికిగాను 103 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా మైత్రీ (9వ తరగతి), దివ్యశ్రీ (8వ తరగతి), మనతేజ్‌గౌడ్ (8వ తరగతి) సాధించారు. వీరికి ప్రిన్సిపల్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు.

ప్రజా సమస్యలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే బీవీకి 400 దరఖాస్తులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకు నా వంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని కుర్ని కల్యాణ మండపంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఎమ్మిగనూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి దరఖాస్తులు అందజేశారు. పింఛన్లు, రోడ్లు, కాల్వలు, జగనన్న రీసర్వేతో నష్టపోయిన రైతులు, విద్యుత్తు సమస్య, వైద్యం, ఇతర సమస్యలపై సుమారు 400 మంది అర్జీలను బీవీకి ఇచ్చారు. కొత్త పింఛన్లు జనవరిలో రానుండటంతో ముందస్తుగా అర్హులను గుర్తించే ప్రక్రియలో భాగంగా అర్జీలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు సోమేశ్వరరెడ్డి, మల్లికార్జున, నరసింహులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కోసిగి, న్యూస్‌టుడే: ఉదయం తాళం వేసి పొలానికి వెళ్లిన ఓ ఇంట్లో దొంగలు బంగారాన్ని ఎత్తుకెళ్లిన ఘటన కోసిగిలోని సిద్దప్పపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... కోసిగికి చెందిన జక్కనగేని శివమ్మ తన పొలంలో పనులకు వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. బీరువాలోని తులం బంగారం నెక్లెస్, తులంగా బంగారు కటాని, కొంత నగదును దొంగలు అపహరించినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

వేతనాలు మంజూరు చేయాలని ధర్నా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పాఠశాలలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు మంజూరు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, తక్షణమే మంజూరు చేయాలని సీఐటీయూ నాయకుడు రాముడు డిమాండు చేశారు. సోమవారం ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. పాఠశాలలో పని చేసే స్కావెంటజర్లకు నాలుగు నెలలుగా వేతనాలు పంపిణీ చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కవిత, పద్మావతి, లక్ష్మి, జూవేదా, ఫర్జానా, రాజమ్మ, జయశ్రీ పాల్గొన్నారు.



ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ, కార్మికులు

ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటాలు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తామని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వర్ణోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అనవసరమైన యాప్‌లను తొలగించాలన్నారు. యూటీఎఫ్ నాయకులు నాగమణి, నవీన్, ఎల్లప్ప, నరసింహులు, కౌలన్న పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

కౌతాళం, న్యూస్‌టుడే: నష్టపోయిన రైతులను ఆదుకుంటామని కౌతాళం తహసీల్దార్ మల్లికార్జున స్వామి, ఏవో శేషాద్రి అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరిగిన వరి పంటల గురించి సోమవారం ఈనాడులో వచ్చిన నేలవాలిన వరి.. రైతుల కంటతడి శీర్షికతో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. తుంగభద్ర నదీతీరంలోని నదిచాగి గ్రామంలోని పంట పొలాలు పరిశీలించి రైతులతో మాట్లాడారు.



నదిచాగిలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏవో

ఏజెంట్ల సమస్యలు పరిష్కరిస్తాం



ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని ఎల్ఐసీ సంఘం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎమ్మిగనూరు పట్టణంలో ఎన్నుకున్నారు. కడప కన్వీనర్ నరసింహులు, సౌత్ సెంట్రల్ జోన్ కన్వీనర్ రంగస్వామి, సౌత్ జోన్ కోశాధికారి సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర నాయకులు మహాదేవప్ప, ఎమ్మిగనూరు బ్రాంచి కన్వీనర్ రామాంజనేయులు, బ్రాంచి కోశాధికారి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బస్సు ఢీకొని పాదచారి దుర్మరణం

రాయచూరు, న్యూస్‌టుడే: పాదచారిని కల్యాణ కర్ణాటక విభాగం ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం రాయచూరు తాలూకా తుంగభద్ర గ్రామ మార్గంలో చోటుచేసుకుంది. మృతుడిని వీరేశ్ (34)గా గుర్తించారు. మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన వీరేశ్ వ్యక్తిగత పనిపై కర్ణాటక సరిహద్దులోని గిల్లేసూగూరుకు వచ్చారు. పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా రాయచూరు నుంచి మంత్రాలయం వెళ్తున్న బస్సు ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ బస్సు వదిలి పరారయ్యారు. ఇడపనూరు ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం



గోనెగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ గంగాధర్, పోలీస్ సిబ్బంది

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలో సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అమర వీరుల చిత్రపటాలకు నివాళి అర్పించారు. అనంతరం వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో...

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పోలీసు అమర వీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ ఉపేంద్రబాబు, పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి దివంగత ఐపీఎస్ ఉమేశ్‌చంద్ర చిత్రపటానికి నివాళులర్పించారు.

ప్రమాదంలో నలుగురికి గాయాలు

మునగాల (గూడూరు), న్యూస్‌టుడే: మండలంలోని మునగాల గ్రామం వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ప్రయాణికులతో ప్రధాన దారిపై వస్తున్న ఆటోను గ్రామంలోని వీధి దారి నుంచి చాకలి అల్లిసావు ప్రధాన దారిపైకి ద్విచక్ర వాహనంపై వేగంగా రావడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆటో చోదకుడు దుబ్బోడు, ప్రయాణికులు గోకారి, నాగేష్, అల్లిసావుకు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.

జూదరుల అరెస్టు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని హనుమాపురం గ్రామంలో సోమవారం జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై నిరంజన్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి సమీపంలో జగనన్న కాలనీ వద్ద జూదమాడుతున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,360 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

వసతి శిథిలం.. నివాసం భయానకం

● ఆందోళన చెందుతున్న విద్యార్థులు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎంతో మందికి ఆసరాగా నిలుస్తున్న వసతి గృహాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. కోడుమూరు మండలంలోని బీసీ బాలుర వసతి గృహాలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు వలస బాట పట్టినప్పుడు తమ పిల్లలు వెంట రాకుండా ఉండేందుకు ఇవెంతగానో ఉపయోగపడతాయి. దాంతో తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ఇక్కడ ఉంచేందుకు ప్రాధాన్యం ఇస్తారు. అయితే కొన్నేళ్లుగా వాటి నిర్వహణ సరిగా లేక శిథిలావస్థకు చేరాయి.

కోడుమూరు మండలంలోని లద్దగిరి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకునేందుకు చాలా మండలాల విద్యార్థులు ఆసక్తి చూపుతారు. పాఠశాల పక్కనే ఒకే ఆవరణలో రెండు వసతి గృహాలు ఉండటం ఇక్కడి ప్రత్యేకత. లద్దగిరి దివంగత మాజీ ముఖ్యమంత్రి విజయభాస్కరరెడ్డి స్వగ్రామం. వందలాది మంది చదువుకుంటున్నా ఇక్కడ కొన్నేళ్లుగా వసతి గృహాలు శిథిలావస్థకు చేరాయి. లద్దగిరి బీసీ వసతి గృహం-1లో 220 మంది, బీసీ వసతి గృహం-2లో 200 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇక్కడ పైకప్పులు కడ్డీలు తేలాయి. గోడలు ప్రమాదకరంగా మారాయి. కిటికీలు, తలుపులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దాంతో చలికి, దోమలకు అవస్థలు పడుతున్నారు.



ప్రమాదకరంగా మారిన గోడలు

ఇక్కడ విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉంటున్నారు. ప్రమాదకరంగా మారిన వసతి గృహాల గదుల నివేదికలు తీసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోలేదు. దాంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. ప్రజాప్రతినిధులు స్పందించి శిథిలావస్థకు చేరిన వసతి గృహాల స్థానంలో కొత్తవి నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

కోడుమూరులో ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం కొన్నేళ్లుగా ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని వైకాపా ప్రభుత్వ హయాంలో ఎత్తేశారు. కేవలం అద్దెకు భవనం దొరకడం లేదన్న సాకుతో విద్యార్థులకు అన్యాయం చేశారు. దాంతో వందలాది మంది విద్యార్థులు మూడేళ్లుగా కోడుమూరులో బీసీ బాలుర వసతి గృహం లేక నష్టపోతున్నారు. ఇప్పటికైనా బీసీ వసతి గృహాలపై శ్రద్ధ చూపి కొత్తగా నిర్మించడం చేయాలని వేడుకుంటున్నారు.



శిథిలావస్థకు చేరిన వసతి గృహం

విగ్రహ ప్రతిష్ఠాపన

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలోని గజ్జలమ్మ కాలనీ (సింగన గేరి)లో సోమవారం నూతనంగా నిర్మించిన గజ్జలాపరమేశ్వరీదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీవాసులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పనులు కల్పిస్తాం.. వలస వెళ్లొద్దు

కోసిగి, న్యూస్‌టుడే: సొంత గ్రామంలోనే ఉపాధి హామీ పనులు కల్పిస్తామని, వలస వెళ్లవద్దని ఆదోని అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ లోకేశ్వర్ గ్రామస్థులకు తెలియజేశారు. సోమవారం ఈనాడులో వచ్చిన పస్తులుండలేక వలస బాట శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించిన ఏపీడీ గ్రామస్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏపీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించండి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో ఇంటి, నీటి పన్నులను సకాలంలో చెల్లించాలని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఖాళీ స్థలాలు, ఇతర పన్నులను ఈ నెల 31లోపు చెల్లించాలన్నారు. నీటి పన్నులు చెల్లించకపోతే కుళాయి తొలగిస్తామన్నారు.

రహదారులు.. కాల్వలు నిర్మించండి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో సీసీ దారులు, కాల్వలు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని నిర్మించి సమస్య పరిష్కరించాలని సీపీఎం నాయకులు సత్యన్న డిమాండు చేశారు. సోమవారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నాయకులు బాలరాజు, బాబు, నరసింహులు, రాముడు, కిష్టప్ప పాల్గొన్నారు.

పందులను అరికట్టాలని వినతి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని లక్ష్మీపేటలో పందుల సంచారం అధికంగా ఉందని తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకుడు గోవిందు అన్నారు. సోమవారం కాలనీవాసులతో కలిసి కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.

కర్నూలు

• కర్నూలు • పాణ్యం



అమరవీరుల కుటుంబసభ్యులతో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, పోలీసు అధికారులు

అమరవీరులను స్మరించుకుందాం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ప్రజల కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని.. వారిని ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. నగరంలోని ఏపీఎస్పీ రెండో పటాలంలో సోమవారం జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినానికి ఆమె హాజరై మాట్లాడారు. ఇన్‌ఛార్జి అదనపు దళాధిపతి మహబూబ్ బాషా మాట్లాడారు. సహాయ దళాధిపతులు షర్ఫుద్దీన్, సుధాకర్‌రెడ్డి, రవికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

జరిమానా విధింపు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరకుమార్ సోమవారం వినాయక ఘాట్, నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని పలు వ్యాపార దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. నాలుగు కేసులు నమోదు చేసి రూ.20 వేల అపరాధ రుసుము విధించినట్లు ఆయన చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632 కర్నూలు గ్రామీణం : 85010 05408 ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ : **సమస్య :** చంద్రశేఖర్ నగర్‌లో పిచ్చిమొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. విష పురుగులు సంచరిస్తున్నాయి. **- స్థానికులు**

సమస్య : నిర్మల్‌నగర్‌లో కాలువలు శుభ్రం చేయాలి. రహదారులపై మురుగు ప్రవహిస్తోంది. **- స్థానికులు**

సమాధానం : సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం. **- నగరపాలక సంస్థ అధికారులు**

ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ.4,389

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం వివిధ పంట ఉత్పత్తులు వచ్చాయి. ఉల్లి క్వింటా కనిష్ఠ ధర రూ.769, గరిష్ఠ ధర రూ.4,389 పలికింది. నాణ్యతగా లేదంటూ కొంత సరకును క్వింటా రూ.2 వేల నుంచి రూ.2500 లోపే కొనుగోలు చేశారని రైతులు వాపోయారు. వేరుశనగకాయలు క్వింటా గరిష్ఠ ధర రూ.6,702, పూల విత్తనాలు రూ.4,619, ఆముదాలు రూ.5,981, మొక్కజొన్న రూ.2,269, ఎండుమిర్చి రూ.10,239కు వ్యాపారులు తీసుకున్నారు.

సిటీ బస్సులు నడపాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నగరంలో సిటీ బస్సులు నడపాలని కర్నూలు సివిల్ ఫోరం అధ్యక్షుడు, భాజపా అధికార ప్రతినిధి డా.కొట్టే చెన్నయ్య కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. నగరంలో ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఎక్కువగా ఉన్నాయని, ఆర్టీసీ బస్సులు తగినన్ని అందుబాటులో లేవని చెప్పారు. ఏడు లక్షల జనాభా ఉన్న నగరంలో సిటీ బస్సులు లేకపోవడం దారుణమని ఆయన చెప్పారు.

నగరపాలక.. అక్రమాలకు వేదిక

■ నిధులు స్వాహా చేసినా చర్యలు శూన్యమే ■ ఆధారాలున్నా పట్టించుకోని అధికారులు

కర్నూలు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో అక్రమాలు తారాస్థాయికి చేరాయి. ప్రజాధనం పక్కదారి పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు కానరావడం లేదు. రూ.కోట్ల నిధులు పక్కదారి పట్టినట్లు ఆధారాలున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కేవలం తాఖీదులు జారీ చేసి చేతులు దులిపేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే :



నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో కొందరు అధికారుల సాయంతో ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్ గుత్తేదారుడి అవతారమెత్తారు. ఏకంగా 89 పనులకు సంబంధించి రూ.6.99 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఇందులో సగానికిపైగా పూర్తికాకుండానే బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. దీంతోపాటు గుత్తేదారుల సంతకాలను సదరు వర్క్ ఇన్‌స్పెక్టర్ చేసి బిల్లులు చేసుకున్నట్లు సమాచారం. అక్రమాలకు పాల్పడిన వివరాలు ఆ విభాగ అధికారుల వద్ద సమగ్రంగా ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోనేందుకు ముందుకు రావడం లేదని సమాచారం. పైగా ఇక్కడ పనిచేసి వెళ్లిన అధికారులకు కేవలం మెమోలు ఇచ్చి సరిపుచ్చారు. కేవలం కంటితుడుపు చర్యలుగా తాఖీదులు ఇచ్చారంటూ నగరపాలక సంస్థలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. నగరపాలక ఉన్నతాధికారి లేని సమయంలో కథ నడిపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చిరుద్యోగి శాసిస్తూ..

కుళాయి కనెక్షన్లలో అక్రమాలు, నీటి సరఫరాకు సంబంధించి ఫిర్యాదులు రావడంలో ఇటీవల ఇద్దరు ట్యాప్ ఇన్‌స్పెక్టర్లకు అధికారులు మెమోలు ఇచ్చారు. వీరిని సస్పెండ్ చేసేందుకు రంగం సిద్ధం చేసి చివరికి వెనకడుగు వేసినట్లు తెలిసింది. కాగా ఓ ట్యాప్ ఇన్‌స్పెక్టర్ వైకాపాకు చెందిన కీలక ప్రజాప్రతినిధి చేత ఫోన్ చేయించి చర్యలు తీసుకోవద్దని ఓ అధికారికి గట్టిగా చెప్పించినట్లు సమాచారం. ఇలా.. ఓ చిరుద్యోగి అధికారులను శాసించే స్థాయికి వచ్చారని నగరపాలకలో చర్చ సాగుతోంది.

రూ.15 లక్షలు డిమాండ్?

నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో అక్రమాలు ఒకటి తర్వాత ఒకటి వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఇటీవల బదిలీపై వెళ్లిన అధికారులు గతంలో రూ.కోట్లల్లో అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. వాటర్ వర్క్స్, సివిల్ పనుల్లో భారీగా అవినీతి జరిగినట్లు సమాచారం. వాటర్ వర్క్స్‌లోనే రూ.2 కోట్ల వరకు అక్రమాలు తేలినట్లు ఇటీవల అధికారులు గుర్తించారని.. ఆ సమాచారం బయటకు రాకుండా చేశారన్న ఆరోపణలున్నాయి. దీంతోపాటు ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్, అధికారులు కలిసి రూ.కోట్లలో నిధులు పక్కదారి పట్టించారు. అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు ఉన్నా.. బాధ్యులపై చర్యలకు ముందుకు రావడం లేదు. కాగా బదిలీపై వెళ్లిన పలువురితో ఒకరు మధ్యవర్తుల ద్వారా సంప్రదింపులు జరిపారని.. సుమారు రూ.15 లక్షలు ఇస్తే మీపై ఎలాంటి చర్యలు తీసుకోమని చెప్పినట్లు సమాచారం.



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

పెట్టుబడి సాయం అందించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించి తక్షణమే రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. డీఆర్వో చిరంజీవిని సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. 2023 రబీ సీజన్‌లో ప్రకటించిన కరవు మండలాలకు పంటనష్ట పరిహారం తక్షణమే ఇవ్వాలని, పత్తి క్వింటా రూ.10 వేలకు కొనుగోలు చేయాలని కోరారు. డీఆర్వోను కలిసినవారిలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తీర్చండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఉల్చాల గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సమస్యను పరిష్కరించాలని డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు రాఘవేంద్ర రెడ్డి, సభ్యులు అధికారులను కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు.

అడ్డుగోడ కట్టేశారు



కర్నూలు నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో ఉన్న ధనలక్ష్మి నగర్‌లో ఉద్యానవనానికి నగరపాలక అధికారులు స్థలం కేటాయించారు. దీని చుట్టూ ప్రహరీ నిర్మించారు. దీనిని అభివృద్ధి చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. దీనికితోడు పార్కులోకి ఎవరూ వెళ్లకుండా అడ్డుగోడ కట్టారు. వెంటనే నిధులు కేటాయించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు విద్య



గణేశ్ నగర్‌లో మోకాలి లోతు గుంతలు



ఇంజినీర్స్ కాలనీలో ఇలా..

అడుగడుగునా గుంతలు.. కళ్లకు గంతలు

కల్లూరు గణేశ్ నగర్‌లో సాయివైభవ్‌నగర్ సమీపంలో రహదారి గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షానికి అధ్వానంగా మారడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ, కర్నూలు నగరం

ప్రకృతి ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓర్వకల్లు న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పండించిన పంట ఉత్పత్తులను వినియోగించటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని డీపీఎం చంద్రశేఖర్, డీఎల్‌పీఎం లక్ష్మయ్య అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి లాభం చేకూరుతుందన్నారు. పర్యావరణం దెబ్బతినకుండా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతి అందించేలా అందరూ కృషి చేయాలన్నారు. ఎంపీపీ తిప్పన్న, ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్డీ సుబ్బరాయుడు, ఏపీఎం వెంకటరామిరెడ్డి, ఏపీవో కుమార సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్‌లో వీరశైవ లింగాయత్‌ల విద్య, ఉద్యోగాలకు సంబంధించి ఓబీసీ రిజర్వేషన్లు అందక అన్యాయం జరుగుతోందని సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆ మేరకు సోమవారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు వీరప్ప, వీరభద్రప్ప, విజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

చిన్నటేకూరు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: గ్రామంలో ద్వైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి.. ఇందూ జ్ఞాన వేదిక కల్లూరు కమిటీ సభ్యులు ద్వైత సిద్ధాంత భగవద్గీత, వంద అనుబంధ గ్రంథాల పఠనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : రూ.10 నాణేలు చెల్లుబాటవుతాయని బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు తెలిపారు. ఆ బ్యాంకు ఆధ్వర్యంలో సోమవారం ప్రజలకు రూ.10 నాణేలు పంపిణీ చేశారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నూతన కౌలుదారు చట్టాన్ని పకడ్బందీగా అమలుచేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కర్నూలు ఉద్యానభవన్‌లో ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల సంబంధించి ప్రాంతీయ సదస్సును మంగళవారం నిర్వహించనున్నారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం కర్నూలు బహుళార్థ పశువైద్యశాల ఆవరణలోని సాంద్ర గొర్రెల విభాగం కార్యాలయంలో మంగళవారం జరుగుతుంది. ఛైర్మన్‌గా శ్రీనివాసులు, వైస్ ఛైర్మన్‌గా బాలగుర్రప్ప యాదవ్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: దేవనకొండ మండలంలోని [illegible] బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా విజిలెన్స్ ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుడు శాంతికుమార్ కోరారు. ఆయన సోమవారం రీజినల్ మేనేజర్ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందించారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: పలువురు తప్పుడు సదరమ్ పత్రాలతో లబ్ధి పొందుతున్నారని.. ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని తెదేపా విభిన్న ప్రతిభావంతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప డిమాండ్ చేశారు. ఆయన సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేధింపులకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కర్నూలు ఎంఈవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు.

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారానికిగాను పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.నారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల తదితరులు పిలుపునిచ్చారు. సోమవారం 19, 20వ వార్డుల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఓ ప్రొఫెసర్ వసతిగృహ విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: నగరంలోని 39, 40వ వార్డులో విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి రాముడు, వార్డు కార్యదర్శి దేవన్న డిమాండ్ చేశారు. సంతోష్ నగర్‌లోని విద్యుత్తు కార్యాలయంలో సోమవారం ఏఈని కలిసి వినతిపత్రం అందించారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: అశోకనగర్‌లోని హెడ్ వాటర్ వర్క్స్‌లో నగరపాలక ఎస్ఈ రాజశేఖర్ సోమవారం అధికారులతో సమీక్షించారు. అనంతరం వర్క్స్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశమయ్యారు.

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు ఎదురవుతాయని బాలల పరిరక్షణ జిల్లా అధికారిణి శారద అన్నారు. ఆమె సోమవారం మాట్లాడుతూ సి.బెళగల్ మండలంలోని కంబందహాల్, గొందిపర్ల, జొహరాపురంలో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మకు ఫిర్యాదులు రావడంతో తమ సిబ్బందితో కలిసి బాల్య వివాహాలను అడ్డుకొని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు.



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. కల్లూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. మొత్తం 113 వినతులు వచ్చాయి. ఆయా గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలతో పాటు ఇతరత్రా సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఆంజనేయులు, ఎంపీడీవో నాగశేషాచలరెడ్డి, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వినతులకు సత్వర పరిష్కారం

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : నగరవాసులు ఇచ్చే వినతులను సత్వరం పరిష్కరించాలని నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ ఆదేశించారు. కర్నూలు నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. 19వ వార్డు జొహరాపురం రోడ్డులో పార్కు స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని కాలనీవాసులు విన్నవించారు.

డీఎస్సీలో అవకాశం కల్పించాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విడుదల చేసే డీఎస్సీ ప్రకటనలో ప్రత్యేక ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని ఏపీ ప్రత్యేక ఉపాధ్యాయ సంఘం జిల్లా ఇన్‌ఛార్జి కొండా లోకేశ్ డిమాండ్ చేశారు. దూపాడు వద్ద ఉన్న అయాన్ డిజిటల్ కేంద్రం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సుమారు 75 వేల మంది ఉన్నారన్నారు. వీరికి బోధన చేయాలంటే ప్రత్యేక ఉపాధ్యాయులు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాసులు, కిరణ్, దుర్గాప్రసాద్, మధురాణి, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

మద్యం దుకాణంతో ఇబ్బందులు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: లక్ష్మీపురం పరిధిలో పాఠశాలల సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారని, దీనిని తొలగించాలని కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. వారు సోమవారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి విన్నవించారు. దుకాణం తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

నిబంధనలు ఉల్లంఘించారు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు మండలం వెంకాయపల్లెలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని నందనపల్లె, పడిదెంపాడు, బి.తాండ్రపాడు సర్పంచులు మావిటి, లాజరు, జయన్న తదితరులు కలెక్టర్ రంజిత్‌బాషాను కోరారు. వారు సోమవారం కలెక్టరేట్‌లో ఆయనకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థలు, వసతిగృహాలు, ఆసుపత్రి దగ్గరలో ఏర్పాటు చేశారని చెప్పారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: వాలంటీర్ వ్యవస్థను కొనసాగించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ వాలంటీర్ల అసోసియేషన్ (ఏఐవైఎఫ్ అనుబంధం) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బీసన్న, వాలంటీర్ల సంఘం నేత కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్తంగా 2.60 లక్షల మంది వాలంటీర్ల వ్యవస్థ కొనసాగుతుందని చంద్రబాబునాయుడు చెప్పారని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడిచినా ఇప్పటివరకు వారి గురించి పట్టించుకోలేదని చెప్పారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు సోమన్న, రాజీవ్, బాబయ్య, చంటి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ సంఘం నాయకులు

సంక్షేమ చట్టం పునరుద్ధరించాలని ఆందోళన

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: భవన నిర్మాణ సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలని.. పెండింగ్ ఉన్న నగదు చెల్లించాలని భవన నిర్మాణ సంఘం నగర కార్యదర్శి నల్లన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని కోరుతూ సోమవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప మాట్లాడారు. అప్పటి వైకాపా ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ చట్టంలో ఉన్న రూ.450 కోట్లు వాడుకుని తీవ్ర అన్యాయం చేసిందని వాపోయారు. ఏఐటీయూసీ నాయకులు బి.వెంకటేష్, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలులో వృద్ధుడి మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : హంద్రీ ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ గుర్తుతెలియని వృద్ధుడు (65) మృతి చెందారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి కర్నూలు వచ్చిన రైలులోని మరుగుదొడ్డిలో విగతజీవిలా పడి ఉండగా ప్రయాణికులు గుర్తించారు. సమాచారం అందుకున్న కర్నూలు రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవటంతో మిస్టరీగా మారింది. కర్నూలు రైల్వేస్టేషన్ పర్యవేక్షణాధికారి నజియాముబీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ తెలిపారు.

కోర్టులో హాజరు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉద్యోగాల పేరుతో మోసగించిన కేసులో హైదరాబాద్‌కు చెందిన సురేష్, ధనలక్ష్మి దంపతులను నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేసిన సంగతి విదితమే. బాధితులు తమ డబ్బు తిరిగి ఇచ్చేయాలని కోరగా కోర్టులో చూసుకుంటామని సురేష్ సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. సురేష్ దంపతులను పోలీసులు సోమవారం కోర్టులో హాజరుపరిచారు.

తప్పుడు నివేదికలిస్తే చర్యలు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న రెగ్యులర్, ఆప్కాస్ సిబ్బంది తమ స్థానంలో బదిలీ వర్కర్లను ఏర్పాటు చేసుకొని పనిచేయిస్తున్నారని నగరపాలక ఎస్ఈ రాజశేఖర్ అన్నారు. సిబ్బంది ఎక్కడెక్కడ పనిచేస్తున్నారు.. అసలు పనిచేస్తున్నారా? లేదా? తదితర వివరాలను 25వ తేదీలోగా అందజేయాలని ఏఈలు, డీఈలను సోమవారం ఆదేశించారు. తప్పుడు నివేదికలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరపాలకకు సకాలంలో పన్నులు చెల్లించి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. రెవెన్యూ విభాగం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి రూ.94.53 లక్షలు వసూలు చేసింది. వంద శాతం పన్ను వసూలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇసుక నమోదులో అక్రమాలు



ఇసుక రవాణా కోసం మా వాహనాలను గనుల శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకున్నామని.. వారం, పది రోజులైనా ఒక్క ట్రిప్పు కూడా ఇసుక బుకింగ్ కావడం లేదని కర్నూలు లోకల్ టిప్పర్స్ ఓనర్స్ సంక్షేమ సంఘం నాయకులు జగన్‌గౌడ్, రామేశ్వరరెడ్డి, మౌలాలి, రఘు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు సోమవారం కలెక్టరేట్‌లో జేసీ డా.బి.నవ్యను కలిసి ఫిర్యాదు చేశారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

వ్యర్థాలు తొలగక.. దుర్గంధం వదలక

• కాలనీల్లో వేధిస్తున్న సమస్యలు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. ఫలితంగా జనం ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తుండటంతో దుర్గంధం వ్యాపిస్తోంది. చివరికి జనం రహదారులపై నడవాలంటే భయపడుతున్నారు. పూడికతీత పనులు సైతం అంతంతమాత్రంగానే సాగుతున్నాయి.



నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో రహదారి పక్కన వ్యర్థాలు

నగరంలోని నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ, రెవెన్యూ కాలనీ, సోమిశెట్టి నగర్, నంద్యాల చెక్‌పోస్టు తదితర ప్రాంతాల పరిధిలో లక్ష మందికిపైగా జనం నివసిస్తున్నారు. 19, 20, 21 వార్డులకు సంబంధించి శానిటరీ ఇన్‌స్పెక్టరు ఉన్నారు. 19వ వార్డు పరిధిలో ముగ్గురు శానిటరీ సెక్రటరీలు విధులు నిర్వహిస్తున్నారు. 15 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికులు నిరంతరం వ్యర్థాలను సేకరించి తరలించాల్సి ఉంది. మరోవైపు అధికారులు పర్యవేక్షించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సి ఉంది.

టన్నుల్లో వ్యర్థాలు..

నగర పరిధిలో ప్రతిరోజూ సుమారు 100 టన్నుల వరకు వ్యర్థాలు పోగవుతూ ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల నుంచి వ్యర్థాలు సేకరించి డంపింగ్ యార్డుకు వాహనాల్లో తరలించాలి. కాలువల్లో పూడిక పనులు నిర్వహించాల్సి ఉంది. కాలనీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను నిత్యం తొలగించాల్సి ఉంది. కానీ చాలా ప్రాంతాల్లో వారి జాడే కానరావడం లేదు. దీనికితోడు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య సిబ్బంది కొరత వేధిస్తోంది. వీటన్నింటిపైనా అధికారులు దృష్టి సారించడం లేదు.

○ నగర పరిధిలోని చాలా ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. సంతోష్ నగర్, బాలాజీ నగర్, నంద్యాల చెక్‌పోస్టు కాలనీ తదితర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో పెద్దఎత్తున మురుగు నీరు నిలుస్తోంది. దోమలు వృద్ధి చెందుతుండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. రోగాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

అంతర్గత విభేదాలతో సమస్యలు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరపాలకసంస్థలోని పలు విభాగాల్లో అధికారుల మధ్య సమన్వయ లోపం నెలకొంది. పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగంలోని అధికారులకు మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. ఇటీవల ఇద్దరు అధికారుల మధ్య మాటామాటా పెరిగినట్లు సమాచారం. వెంకటరమణ కాలనీ సమీపంలో ఓ బహుళ అంతస్తు నిర్మాణం వద్ద కాలువ, సీసీ రహదారుల నిర్మాణం విషయంలో అధికారుల మధ్య విభేదాలకు దారితీసినట్లు తెలిసింది.